# తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక
వార్త





## ఆగి ఉన్న లారీని ఢీకొన్న ఆర్టీసీ బస్సు
### పలువురికి గాయాలు



వి.కోట, డిసెంబర్ 10 ప్రభాతవార్త

కుప్పం - పలమనేరు జాతీయ రహదారిలో మండలంలోని జీడిగుట్ట ప్రాంతంలో బుధవారం వేకువజామున ఆగి ఉన్న లారీని కుప్పం ఆర్టీసీ డిపోకు చెందిన లగ్జరీ బస్సు ఢీకొంది. దీంతో సుమారు పదిమంది దాకాప్రయాణీకులు గాయాలపాలయ్యారు. హుటాహుటిన వీరిని చికిత్స నిమిత్తం కుప్పం పిఇఎస్, ఇతర ఆస్పత్రులకు స్థానికులు తరలించారు. విజయవాడ నుంచి కుప్పం వైపు వస్తున్న ఆర్టీసీ బస్సు బుధవారం ఉదయాన్నే లారీని ఢీకొన్నట్లు స్థానికులు తెలిపారు. ఈ ప్రమాదంలో కృష్ణగిరికి చెందిన జయమ్మ (61), రాధాకృష్ణ (48), బద్వేలుకు చెందిన పార్థసారథి (40), నగరికి చెందిన సురేష్ (38), జ్యోతి (34), తిరుపతికి చెందిన సుమంత్ (17), రేఖ (35), తమిళనాడు హొసూరుకుచెందిన రాధ (25)తో పాటు పలువురు గాయపడ్డారు.

## శ్రీవారి సేవలో సుబుదేంద్రతీర్థస్వామి

తిరుమల,డిసెంబర్ 10ప్రభాతవార్తప్రతినిధి:



రాఘవేంద్రస్వామిమఠం పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థస్వామి శిష్యులతో, భక్తులతో కలసి బుధవారం ఉదయం శ్రీవారిని దర్శించుకున్నారు. మహద్వారం వద్ద టిటిడి ఈఓఅనిల్‌కుమార్‌సింఘాల్, అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం, ఆలయ అర్చకులు స్వాగతం పలికి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## అమ్మా తల్లి చల్లంగా చూడు..
### ఏడు గంగమ్మల జాతర:వేయికళ్ళ దుత్తలతో మొక్కులు తీర్చుకున్న భక్తులు



శ్రీకాళహస్తి, డిసెంబర్ 10 ప్రభాతవార్త

దక్షిణ కైలాసం శ్రీకాళహస్తిలో వేడుకగా ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఏడుగంగమ్మల జాతరను ఈ ఏడాది భక్తుల భాగస్వామ్యంతో నిర్వహించారు. మంగళవారం అర్ధరాత్రి దాటిన తరువాత ముత్యాలమ్మగుడి నుంచి బయలుదేరిన ఏడు గంగమ్మలు స్థావరాలకు ఉదయం 8గంటలకు చేరాయి.గతంలో స్థావరాలు చేరే సమయానికి ఉదయం 9గంటలయ్యేది. ఈ సారి సమయపాలనకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చారు. భక్తి శ్రద్దలతో సంప్రదాయ బద్ధంగా నిర్వహించారు.జాతరలో ఎలాంటి విఘ్నాలు జరగకుండా పోలీసులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు. డివైయస్‌పి నరసింహామూర్తి, సిఐ ప్రకాష్ కుమార్‌ల సారథ్యం లో బందోబస్తు నిర్వహించారు. అయితే ట్రాఫిక్‌కు, జనాలకు ఇబ్బంది లేకుండా కట్టడి విధించారు. మంగళవారం అర్థరాత్రి దాటిన తరువాత స్థానిక ఆచార వ్యవహారాల మేరకు ఏడు గంగమ్మలు నిల్చు ఆలయం వద్ద పసుపు ముద్దలతో అమ్మవారి రూపాలను అలంకరించారు. అభిషేకం జరిపించారు. తరువాత ఏ గంగమ్మ కమిటి నిర్వాహకులో వారు పసుపు ముద్దలను నెత్తిన పెట్టుకొని స్థావరాలకు ఏకాంతంగా భక్తుల సందడి లేకుండా చేర్చుకున్నారు. అక్కడ వేసిన పందిళ్ళలో అమ్మవారి పసుపుముద్దలను ప్రతిష్టించి దీపాలు వెలిగించారు. రెండేళ్ళ పాటు కోవిడ్ నిబంధనలతో జాతరనుముక్తసరిగా నిర్వహించారు. ఈ ఏడాది జాతరను భక్తుల భాగస్వామ్యంతో నిర్వహించటంతో ఒక్క సారిగా భక్తులు తరలి వచ్చారు. మంగళవారం పట్టణంలో ఇసుకేస్తే రాలనంత రద్దీ చోటు చేసుకుంది. ఏ గంగమ్మ వద్ద చూసినా రద్దీ కనబడింది. జాతర సందర్భంగా గతంలో కన్నా అధిక సంఖ్యలో జరిగే జంతుబలి ఈ సారి కనబడలేదు. భక్తులకు, ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం లేకుండా ముందస్తు ప్రణాళికతో పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు.

**పసుపుముద్దల సమర్పణ..**

పట్టణంలోని ముత్యాలమ్మగుడివీధిలోని తెట్టురాయికి సమీపంలోని ఏడుగంగమ్మలు నిలిచేస్థలంలో ఏడు ప్రాంతాల్లో గంగమ్మలను ఆచారం ప్రకారం నిల్పారు. ఏగుగంగమ్మల ఆలయంలో మూలవిరాట్టుకు ప్రత్యేక అలంకారాల్ని నిర్వహించారు. కుంభంచుట్టు గుమ్మడికాయల్ని ఏర్పాటుచేశారు. వాటిని ఒకే వేటులో నరికి బలిదానం చేశారు. అనంతరం అఖండ హారతులిచ్చారు. ఈసందర్భంగా కుమ్మరులు చెందిన వారు బంకమట్టిని రజకులు ముద్దలు చేసి పసుపుతో కలిపి అమ్మవారి రూపాలుగా తయారుచేశారు. ఈసందర్భంగా ఇక్కడ జాతర



ఎందుకు చేయాలి? ఎలా చేయాలి? అనే అంశాలకు సంబందించి వివరించారు.తర్వాత భక్తిశ్రద్దలతో తయారుచేసిన పసుపు ముద్దల చొప్పున ఇచ్చారు. వాటిని ఆయా గంగమ్మల కమిటీ నిర్వాహకులు తీసుకుని భద్రపరచారు. అమ్మవారికి ఎదురుగా అఖండదీపాన్ని వెలిగించారు. కాగా దేవస్థానం సమర్పించిన సారెను ఆలయం నుంచి అందించారు. అనంతరం వేకవజాము నాలుగుగంటల సమయంలో మేళతాళాలు, మంగళవాయిద్యాలు పంబజోళ్లమోత, తప్పెట్లతో గంగమ్మలను(పసుపు ముద్దలను). ముత్యాలమ్మగుడివీధిలోగంగమ్మలుబయలుదేరే సమయంలో మొదట ప్రతి అమ్మవారి విగ్రహం వద్ద గుమ్మడికాయలు, టెంకాయలు కొట్టి అఖండ కర్పూరహారతులిచ్చారు.

## స్వర్ణాంధ్ర లక్ష్యంగా ముందడుగు
### 20 సూత్రాల కార్యక్రమాల అమలు ఛైర్మన్ లంకా దినకర్



చిత్తూరు, డిసెంబర్ 10 ప్రభాతవార్త:

ప్రధాని నరేంద్రమోడి సంకల్ప వికసిత్ భారత్-2047, సిఎం నారా చంద్రబాబునాయుడు ధ్యేయం స్వర్ణాంధ్ర లక్ష్యంగా ముందడుగు వేయాలని 20 సూత్రాల కార్యక్రమాల అమలు ఛైర్మన్ లంకా దినకర్ అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశభవనంలో బుధవారం 20 సూత్రాల కార్యక్రమాల అమలు ఛైర్మన్ లంకా దినకర్, కలెక్టర్ సుమిత్‌కుమార్, మేయర్ అముదలు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో లంకా దినకర్ మాట్లాడుతూ విద్య, వైద్య స్వర్ణాంధ్ర లక్ష్య సాధనలో జిల్లా అగ్రస్థానంలో నిలవాలని, స్వర్ణాంధ్ర, వికసిత్ భారత్ సంకల్పనికి అనుగుణంగా విద్య, వైద్య రంగంలో చిత్తూరు జిల్లా ఉత్తమ ఫలితాలు సాధించాలని, జాతీయ ఆరోగ్య మిషన్ కార్యక్రమాల అమలుపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ సిఎం నారా చంద్రబాబునాయుడు కుప్పం నియోజకవర్గంలో విజన్-2047, స్వర్ణకుప్పం-2029 కార్యక్రమాలను ప్రారంభించారన్నారు. అలాగే జిల్లాలో ఉపాధి కింద 150 కోట్ల రూపాయలు ఖర్చు చేవామని, సిసి రోడ్లు, గోకులం షెడ్లు తదితరాలు మంజూరు చేసి 80 శాతం పనులు పూర్తి చేయడం జరిగిందన్నారు. చిత్తూరు నగర దాహార్తి తీర్చడానికి అడవిపల్లి రిజర్వాయర్ నుండి తాగునీటి పైపుల నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. అర్హులైన వారికి వివిధ సంక్షేమ పథకాలు అందించడానికి సంబంధిత అధికారులకు దిశ దశ నిర్దేశం చేయడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో జిల్లా ప్రణాళిక అధికారి శ్రీనివాసులు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డిటి సుధారాణి, డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ వెంకటప్రసాద్, జడ్పీ సిఇఓ రవికుమార్‌నాయుడు, జిల్లా విద్యాశాఖ అధికారి వరలక్ష్మీ, సర్వ శిక్షాభియాన్ అధికారి వెంకటరమణ, డ్వామా పిడి రవికుమార్, ట్రాన్స్‌కో ఎస్ఇ ఇస్మాయిల్, వ్యవసాయశాఖ జెడి మురళీకృష్ణ, హౌసింగ్ పిడి సుబ్రమణ్యం, ఇతర అధికారులు పాల్గొన్నారు.

### స్థానికులకు వైకుంఠ దర్శనాలపై
## టిటిడి నిర్ణయం మారుతుందా!
### -ఆన్‌లైన్‌లో టోకన్లు విడుదల బ్రేక్ -16న బోర్డు సమావేశంలో నిర్ణయం



తిరుమల, డిసెంబర్ 10ప్రభాతవార్తప్రతినిధి:

తిరుమల ఆలయంలో పవిత్రమైన వైకుంఠద్వార దర్శన భాగ్యం స్థానికులకు కల్పించడంపై టిటిడి ముందు తీసుకున్న నిర్ణయంలో మార్పులు వచ్చే సూచనలు కనిపిస్తున్నాయి. గతం కంటే భిన్నంగా స్థానికులకు పదిరోజుల వైకుంఠ దర్శనాల్లో ఈ ఏడాది పూర్తిగా ఆన్‌లైన్‌లోనే ఇ డిప్‌లో సామాన్యభక్తులకు టోకన్లు కేటాయించారు. తిరుపతి,తిరుమల,చంద్రగిరి, రేణిగుంట స్థానికులకు మాత్రం బుధవారం ఉదయం రోజుకు 5వేల టోకెన్లు జారీచేయాల్సి ఉండగా తాత్కాలికంగా వాయిదా వేశారు. దీనివెనుక స్థానికులుగా దర్శనం సరైన ప్రాధాన్యత లేదనే నిరసనలు, వాదనలు అటు భక్తుల నుండి ఇటు ప్రజాప్రతినిధులు, రాజకీయ నేతల నుండి వెల్లువెత్తడంతో బోర్డు, టిటిడి అధికారులు పునరాలోచనలో పడ్డారనేది తెలుస్తోంది. అయితే టిటిడి మాత్రం సాంకేతికకారణాలతో విడుదలచేయలేదని సమాచారం. డిసెంబర్ 30నుండి జనవరి 8వరకు పదిరోజుల వైకుంఠద్వార దర్శనాల్లో జనవరి 6,7,8తేదీల్లో కేటాయించిన దర్శనాలను తొలి మూడురోజులు ఆఫ్‌లైన్‌లోనే ఇవ్వాలనేది స్థానికుల డిమాండ్. మరీ 16వతేదీ టిటిడి బోర్డు ఈ విషయంపై ఎలా నిర్ణయం వెలువడిస్తుందనేది చూడాల్సిందే. మొత్తం 182 గంటల్లో 164గంటలు సామాన్యభక్తులకు దర్శనం కల్పిస్తామని టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు తెలిపారు. ఈ ఏడాది ఆఫ్‌లైన్‌టోకన్లు కౌంటర్లు పూర్తిగా రద్దుచేయడం కూడా కొంత అసహనం వ్యక్తమవుతోంది.

## ఎస్ఐల బదిలీలు

చిత్తూరు, డిసెంబర్ 10 ప్రభాతవార్త:

జిల్లాలో 21 మంది ఎస్ఐలను బదిలీ చేస్తూ ఎస్పీ తుషార్ దూడి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు వివిధ పోలీస్ స్టేషన్లలో శిక్షణ పొందుతున్న ట్రైనీ ఎస్ఐలకు పోలీస్ స్టేషన్లు కేటాయిస్తూ ఎస్పీ ఉత్తర్వులు జారీ చేయగా మరో 12మంది ఎస్ఐలను బదిలీ చేశారు. పుంగనూరు రూరల్ సర్కిల్‌లో శిక్షణ పొందుతున్న వి.మణికంఠేశ్వర రెడ్డిని ఎన్ఆర్ పేట పోలీస్ స్టేషన్ ఎస్ఐగా, చిత్తూరు రూరల్ ఈస్ట్ సర్కిల్‌లో శిక్షణలో వున్న కెబి.చందన ప్రియను బైరెడ్డిపల్లి పోలీస్ స్టేషన్, కల్లూరు సర్కిల్‌లో శిక్షణలో వున్న కె.మధుసూ దన్‌ను రొంపిచెర్ల, పలమనేరు రూరల్ సర్కిల్‌లో శిక్షణలో వున్న బి.జయశ్రీని ఐరాల, పల మనేరు రూరల్ సర్కిల్‌లో శిక్షణలో వున్న ఎ.మారెప్పను పెద్దపంజాణి, చితూరు రూరల్ వెస్ట్ సర్కిల్‌లో శిక్షణలో వున్న వి.అశోక్‌కుమార్ నాయక్‌ను చిత్తూరు తాలుకా, కార్వేటినగరం సర్కిల్‌లో శిక్షణలో వున్న ఎన్.రమేష్‌ను సోమల, నగరి రూరల్ సర్కి ల్‌లో శిక్షణలో వున్న ఎన్. మల్లికార్జున్‌ను నింద్ర, చిత్తూరు వెస్ట్ సర్కిల్‌లో శిక్షణలో వున్న డి.తేజశ్వనిని కార్వేటినగరం పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే సదుం పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న షేక్షావలిని వి.కోట అర్బన్ పోలీస్ స్టేషన్‌కు, ఎన్ఆర్‌పేట ఎస్ఐ కె.నాగసౌజన్యను చి త్తూరు ట్రైనింగ్ సెంటర్, సోమల ఎస్ఐ కె.శివశంకరను చిత్తూరు మహిళా స్టేషన్, రొంపిచెర్ల ఎస్ఐ సుబ్బారెడ్డిని చిత్తూరు క్రైం పోలీస్ స్టేషన్, తవణంపల్లి ఎస్ఐ చిరంజీవిని చిత్తూరు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్, గుడుపల్లి ఎస్ఐ డి.శ్రీనివాసులును సదుంకు, వెదురుకుప్పం ఎస్ఐ టి.వెంకట సుబ్బయ్యను వెకెన్సీ రిజర్వ్, విఆర్‌లో వున్న పి.శ్రీనివాస రావును చిత్తూరు ట్రైనింగ్ సెంటర్, విఆర్‌లో వున్న డాక్టర్ నాయక్‌ను తవణంపల్లి, విఆర్‌లో వున్న నవీన్‌బాబును వెదురుకుప్పం, విఆర్‌లో వున్న కెఆర్ పార్థసారధిని చిత్తూరు సిసిఎస్, విఆర్‌లో వున్న ఎన్.మునికృష్ణను చిత్తూరు సిసిఎస్ పోలీస్ స్టేషన్‌కు ఎస్పీ తుషార్ దూడి బదిలీ చేశారు.

## తిరుపతి వద్దు - నెల్లూరు ముద్దు
### గూడూరు కోసం మూత పడ్డ ప్రభుత్వ ప్రవేట్ విద్యా సంస్థలు - విద్యార్థి సంఘాల నాయకుల ఆధ్వర్యంలో రాస్తా రోకో





గూడూరు, డిసెంబర్ 10, ప్రభాతవార్త

గూడూరును నెల్లూరు జిల్లాలో కలపాలని కోరుతూ విద్యార్థి సంఘాల నాయకుల ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రవేట్ విద్యా సంస్థలను మూసివేసి విద్యార్థులు రోడ్డు పై బై ఠాయించి రాస్తా రోకో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్‌లు ఎన్నికల హామీ లో ఇచ్చిన విధంగా తిరుపతి జిల్లాలో ఉన్న గూడూరును గూడూరు జిల్లాగా లేదా నెల్లూరు జిల్లాలో కలపాలని, ఉమ్మడి నెల్లూరు జిల్లా గూడూరు పట్టణంలో ఆందోళనలు ఉధృతం అవుతున్నాయన్నారు. టవర్ క్లాక్ సెంటర్‌లో ఉమ్మడి కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో పది రోజులుగా రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయని గుర్తు చేశారు. అందులో భాగంగా ప్రభుత్వ, ప్రవేట్ విద్యా సంస్థలు మూత పడ్డాయన్నారు.తమ నిరసనకు స్వచ్ఛందంగా దుకాణదారులు షాపులను మూసివేశారని తెలిపారు. విద్యార్థి యువజన జేఏసీ ఆధ్వర్యంలో సాదుపేట సెంటర్‌లో రోడ్డు పై బైఠాయించి రాస్తా రోకో చేపట్టడం జరిగిందన్నారు. దీంతో సుమారు గంటకు పైగా భారీగా వాహనాలు నిలిచి పోయాయి. తిరుపతి వద్దు నెల్లూరు ముద్దు, ప్రాణాలైనా అర్పిస్తాం అంటూ నినాదాలు చేశారు. గూడూరును నెల్లూరులో కలిపే వరకు ఆందోళనలు ఉధృతం చేయడం జరుగుతుందని విద్యార్థి సంఘం నాయకులు హెచ్చరించారు.కాగా గూడూరును జిల్లా కేంద్రం చేయాలి లేదా నెల్లూరు జిల్లాలో కలపాలంటూ విద్యార్థి సంఘాలు తలపెట్టిన విద్యా సంస్థల బంద్ విజయవంతమైందన్నారు. అన్నీ ప్రవేటు, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు మూతపడ్డాయని తెలిపారు. గూడూరు పట్టణంలో విద్యార్థి సంఘాలు చేపట్టిన విద్యా సంస్థల బంద్ విజయవంతమైంది. ప్రవేటు పాఠశాలలు, కళాశాలలు ముందుగానే బంద్ ప్రకటించాయని, ఇక ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు పనిచేస్తుండడంతో విద్యార్థి సంఘాల నాయకులు వెళ్ళి విద్యార్థులను బయటకు పంపారన్నారు. పట్టణంలోని డీ.ఆర్.డబ్ల్యూ కళాశాల, జడ్పీ ఉన్నత పాఠశాలలను మూయించారు. స్థానిక సాధుపేట సెంటర్ లో నాయకులు రోడ్డుపై బైటాయించి నిరసన తెలిపారు. దీంతో కొంతసేపు వాహన రాకపోకలకు అంతరాయం కలిగింది. ఈ కార్యక్రమంలో నాయకులు మనోజ్, శశి, సునీల్ తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉంటే పాత బస్టాండ్ సెంటర్‌లో ఇదే అంశంపై ప్రజా సంఘాలు జేఏసీ నాయకులు చేపట్టిన రిలే నిరాహార దీక్ష నాల్గవ రోజు చేరింది.

## గణనాధుడిని దర్శించుకున్న పలువురు ప్రముఖులు



లంకా దినకరన్‌కు స్వామి వారి చిత్రపటాన్ని అందిస్తున్న ఎఇఓ, ఎమ్మెల్సీ రామ్‌గోపాల్‌రెడ్డికి స్వామి వారికి స్వామి వారి చిత్రపటంను అందిస్తున్న ఆలయ ఛైర్మన్ మణినాయుడు.

## రెవెన్యూ భూసమస్యలు, రీ సర్వే అంశాలపై కలెక్టర్ సమీక్ష



తిరుపతి కలెక్టరేట్ డిసెంబర్ 10 ప్రభాతవార్త:

జిల్లాలోని డివిజనల్, మండల స్థాయి రెవెన్యూ అధికారులతో ట్రైని కలెక్టర్ సందీప్ రఘు వాన్సీ,జిల్లా రెవెన్యూ అధికారి జి నరసింహులు తో కలసి జిల్లా కలెక్టర్ డా ఎస్. వెంకటేశ్వర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. బుధవారం ఉదయం స్థానిక కలెక్టరేట్. వీడియో కాన్ఫిరెన్స్ హాలు నందు జిల్లాలోని. డివిజనల్, మండల రెవెన్యూ అధికారులు ల్యాండ్ అండ్ సర్వేయర్లతో రెవెన్యూ అంశాలు, భూసమస్యలపై సంబంధిత అధికారులతో పి ఎమ్ ఎ వై హౌసింగ్ లకు సంబంధించి పొసిషన్ సర్టిఫికెట్స్, రెవెన్యూ మరియు రీ సర్వే, ల్యాండ్ అలినేషన్, ప్రైవేట్ ల్యాండ్ 22 ఏ, ల్యాండ్ రెగ్యులరీష్షన్, అసైన్మెంట్ ల్యాండ్స్, ఇనాం, ఆర్ ఓ ఆర్ వెబ్ ల్యాండ్, మ్యూటేషన్ ఐ వి ఆర్ ఎస్, ఎలక్షన్స్ తదితర అంశాలపై సమీక్ష నిర్వహించి దిశా నిర్దేశం చేసారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిస్కార వేదికకు వచ్చు అర్జీలు అధిక మొత్తంలో రెవెన్యూ, భూసమస్యలు, పి ఎమ్ ఎ వై హౌసింగ్ లకు సంబంధించి పొసిషన్ సర్టిఫికెట్స్, రెవెన్యూ, రీ సర్వే, ల్యాండ్ అలినేషన్, ప్రైవేట్ ల్యాండ్ 22 ఏ, ల్యాండ్ రెగ్యులరీష్షన్, అసైన్మెంట్ ల్యాండ్స్, ఇనాం, ఆర్ ఓ ఆర్ వెబ్ ల్యాండ్ లపై వస్తున్నాయన్నారు. అర్జీలను నిర్ణయించిన కాలంలోపల డివిజన్ స్థాయిలో పరిస్కారం అయ్యో సమస్యలను డివిజనల్ అధికారులు, మండల స్థాయిలో తహసీల్దార్లు పరిష్కారం చూపాలన్నారు. అలాగే అధిక మొత్తంలో రెవెన్యూ, భూసమస్యలపై కోర్టు కేసులు నమోదు అవుతున్నాయని వాటిని సత్వరమే పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. కుల ధ్రువీకరణ పత్రాలను కోరి అర్జీలను సమర్పించువారికి సకాలంలో కుల ధ్రువీ కరణ పత్రాలను అందేలా చూడాలన్నారు. రెవిన్యూ, భూసమస్యలు, ఇతరత్రా పనులపై కార్యాలయాలకు వచ్చు ప్రజలతో మర్యాద పూర్వకంగా మాట్లాడాలన్నారు.

## ఇండిగో విమానాలు నడుస్తున్నాయి.... అపోహలు నమ్మొద్దు....
### ఎయిర్పోర్ట్ డైరెక్టర్ భూమి నాథన్



.రేణిగుంట డిసెంబర్ 10 ప్రభాతవార్త...

రేణిగుంట (తిరుపతి) విమానాశ్రయం నుండి రాకపోకలు సాగిస్తున్న ఇండిగో విమాన సర్విస్ విమానాలన్నీ సకాలంలో నిరాటంకంగా నడుస్తున్నాయని, అపోహలను నమ్మొద్దని రేణిగుంట (తిరుపతి) విమానాశ్రయం డైరెక్టర్ భూమి నాథన్ అన్నారు. రేణిగుంట (తిరుపతి) విమానాశ్రయ టెర్మినల్ భవనంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డైరెక్టర్ భూమినాథన్ మాట్లాడుతూ అనివార్య కారణాలవల్ల ఇండిగో విమాన సర్వీసుకు సంబంధించిన విమానాలు కొన్ని డిసెంబర్ 5, 6 తేదీల్లో రద్దయిన విషయం వాస్తవమన్నారు. 5వ తేదీ 24 విమానాల గాను 18 విమానాలు రద్దు అయ్యాయన్నారు. 6 విమానాలు ఆలస్యంగా నడిచాయన్నారు.ఆరవ తేదీ 2 విమానాలు రద్దుకాగా 10 విమానాలు ఆలస్యంగా రాకపోకలు సాగించాయన్నారు. రద్దయిన విమానాల ప్రయాణికులకు ప్రత్యామ్నాయ ప్రయాణ సౌకర్యాలు సమకూర్చామన్నారు.7వ తేదీ నుండి ఇండిగో విమాన సర్వీసులన్నీ యధాతథంగా నడుస్తున్నాయన్నారు. ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా జాగ్రత్తలు చేపట్టామన్నారు. విమానాలు రద్దయిన రెండు రోజులు ప్రయాణికులకు అవసరమైన ప్రాథమిక సౌకర్యాలు ఏర్పాటు చేశామన్నారు. మంచినీరు, భోజనం, కూర్చునేందుకు సీట్లు సమకూర్చామన్నారు. రద్దయిన విమానాల ప్రయాణికులకు వారు కొన్న టికెట్ల చార్జీలు మొత్తం తిరిగి చెల్లించామని ఇండిగో విమాన సర్వీసుల ప్రతినిధుల తరఫున తెలిపారు. సమావేశంలో డిప్యూటీ డైరెక్టర్ జనరల్ దొరై రాజ్, సిఐఎస్ఎఫ్ అసిస్టెంట్ సెక్యూరిటీ కమాండెంట్ అనురాగ్ యాదవ్, హెచ్ఆర్ మేనేజర్ కశ్యప్, ఇండిగో విమాన యాన సర్వీస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

**తిరుపతి జిల్లా నాయుడుపేట కు చెందిన క్రీడాకారుడు గణేష్ ఇటీవల జరిగిన ప్రపంచ ఆర్చరీ యూత్ ఛాంపియన్ షిప్ టీమ్ గోల్డ్ మెడల్ సాధించిన సందర్భంగా జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వ ని మర్యాదపూర్వకంగా కలిసిన సందర్భంగా అభినందించిన కలెక్టర్**



**స్థానిక పాచికాల్వ గంగమ్మ జాతర సందర్భంగా తిరుమల టిడిపి అధ్యక్షుడు రాజు యాదవ్ ఆధ్వర్యంలో తిరుపతి కూటమి నేతలు ఎమ్మెల్యే .శ్రీనివాసులు,మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ,పలువురు బోర్డు సభ్యులు,ముఖ్య నేతలు అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. ఉదయం 10 గంటలకు వినాయక ఆలయం నుంచి కార్యక్రమం ప్రారంభమైంది.**



# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## మహిళలు ఆర్థికంగా బలోపేతం చెందాలి

**శాంతిపురం, డిసెంబర్ 10 ప్రభాతవార్త**



మహిళలు ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాల ద్వారా ఆర్థికంగా బలోపేతం చెందాలని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు కోరారు. బుధవారం మండల కార్యాలయంలో ఫ్రంటైయర్ మార్కెట్స్ సంస్థచేపట్టిన షీలీడ్స్ ఆంధ్ర కార్యక్రమంపై మహిళలకు అవగాహన కల్పించారు. గ్రామీణ ప్రాంతాల్లో మహిళలకుడిజిటల్ అక్షరాస్యత నేర్పడంతో పాటు మహిళలు వ్యాపార రంగంలో రాణించేలా ఈ కార్యక్రమం రూపకల్పన చేయబడిందన్నారు. సహేలీ యాప్ ద్వారా మహిళలు ఉత్పత్తుల కొనుగోలు, విక్రయాలు ఆన్‌లైన్‌లో చేయడంతో పాటు ఆదాయం సంపాదించుకోవచ్చన్నారు. ఈ వ్యాపారాలు చేసే మహిళలకు పదిహేను వేల రుణం సైతం అందించడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు ఉదయ్‌కుమార్, కార్మిక బోర్డు మెంబర్ విశ్వనాథనాయుడు, సర్పంచ్ జనార్ధనరెడ్డి, పిఏసిఎస్ ఛైర్మన్ గోపాల్, నేతలు చంద్ర, రమేష్, సింగిరి శ్రీనివాసులు, అనసూయ, మహిళలు పాల్గొన్నారు.

## గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

**శాంతిపురం, డిసెంబర్ 10 ప్రభాతవార్త**

కుప్పం – పలమనేరు జాతీయ రహదారిలో మండలంలోని మఠం గ్రామం వద్ద బుధవారం మధ్యాహ్నం ఓగుర్తు తెలియని వాహనం ఢీకొన్న సంఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా.. వి.కోట మండలం దాసార్లపల్లికి చెందిన జయరామాచారి కుమారుడు చంద్రకాంత్ (31() టువీలర్‌లో మండలంలోని రాళ్లబూదుగూరులో ఉన్న తన దుకాణంకు వెళ్తుండగా వెనుకవైపు నుంచి గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అతని తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. రాళ్లబూదుగూరు ఎస్సై లోకేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నట్లు తెలిసింది.

## పిల్లల గుండె సంబంధిత వ్యాధులపై ఉచిత వైద్యశిబిరం

**చిత్తూరురూరల్, డిసెంబరు 10 ప్రభాతవార్త:**



గుడిపాలమండలం బొమ్మసముద్రం ప్రాథమిక ఆరోగ్యకేంద్ర ఆవరణలో ఈనెల 12వ తేది శుక్రవారం పిల్లలకు గుండె సంబంధిత వ్యాధులకు సంబంధించి బెంగళూరు వైదేహి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ సహకారంతో వైద్యశిబిరంను నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ తెలిపారు. 18సంవత్సరాల లోపు వయస్సుకలిగిన పిల్లలకు గుండె, శ్వాసకోశ, వివిధ రకాల వ్యాధులకు సంబంధించి వైద్యులు పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా శస్త్రచికిత్సలు చేస్తారన్నారు. ఈ అవకాశాన్ని నియోజకవర్గ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు.

## యువతను బలహీనపరచడానికి డ్రగ్స్ మాఫియాలు కొత్త తరహా యుద్ధం

– ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు

**చిత్తూరుహెల్త్, డిసెంబర్ 10 ప్రభాతవార్త:**



దేశంలో యువతను బలహీనపరచడానికి డ్రగ్స్ మాఫియా కొత్త తరహా యుద్దానికి తెలలేపాయని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు ఆందోళన వ్యక్తం చేశారు. చిత్తూరు అపోలో నాలెడ్జ్ సిటీలో బుధవారం 'సబ్‌స్టెన్స్ అబ్యూస్–ది సైలెంట్ క్రైసిస్' సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు మాట్లాడుతూ ఇండియా ఐటి రంగంలో ప్రపంచ అగ్రగామిగా ఎదుగుతుండటంతో అసూయతో కొన్ని శత్రుదేశాలు డ్రగ్స్‌ను ఆయుధంగా మార్చుకుని యువతపై యుద్ధం మొదలుపెట్టాయన్నారు. సరిహద్దుల్లోనే ఆగాల్సిన డ్రగ్స్ నేడు చిన్న పట్టణాలు, పాఠశాలల వరకు రావడం ఆందోళన కలిగించే విషయమన్నారు. డ్రగ్స్ ఒకరి చెడు అలవాటు కాదని, ఇది దేశ భవిష్యత్తును లక్ష్యంగా చేసుకున్న 'డ్రగ్స్ యుద్ధం' అని, ప్రతి పౌరుడు అప్రమత్తంగా వుండాలని పిలుపునిచ్చారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పోతురాజు మాట్లాడుతూ అపోలో నాలెడ్జ్ సిటీ ఇప్పటికే ర్యాగింగ్ ఫ్రీ, పొల్యూషన్ ఫ్రీ క్యాంపస్‌గా నిలిచిందని, ప్రస్తుతం డ్రగ్స్ ఫ్రీ క్యాంపస్‌గా మరింత బలోపేతం చేయడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ అముద, ఎఐఎంఎస్ఆర్ డీన్ డాక్టర్ అల్ఫ్రెడ్ జె.అగస్టీన్, యూనిట్ హెడ్ ఎస్.బాలరాజ్, స్థానిక నాయకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు స్టడీ మెటీరియల్ వితరణ

**బంగారుపాళ్యం, డిసెంబర్ 10 ప్రభాతవార్త:**



బోడబండ్ల జడ్పీ ఉన్నత పాఠశాల నందు చదువుతున్న టెన్త్ విద్యార్థులకు గ్రామానికి చెందిన వెంకటేష్ స్టడీ మెటీరియల్‌ను ఉచితంగా అందజేశారు. యుటిఎఫ్ కార్యవర్గం ముద్రించిన స్టడీ మెటీరియల్‌ను వెంకటేష్ కొనుగోలు చేసి విద్యార్థులకు ఉచితంగా అందజేశారు. ఈ స్టడీ మెటీరియల్ ద్వారా సులభమైన రీతిలో విద్యార్థులు చదువుకుని మంచి ఫలితాలు సాధించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెడ్మాస్టర్ నిర్మల, యుటిఎఫ్ సభ్యులు మొగిలయ్య, మాజీ సర్పంచ్ వెంకటప్ప, ఉపాధ్యాయులు గుణశేఖర్, చంద్రశేఖర్‌రెడ్డి, అబ్దుల్‌భాషా, బాలాజీ, శాంతమ్మ, సౌందర్య తదితరులు పాల్గొన్నారు.

## సర్పంచ్ రుద్రమూర్తినాయుడుచే ఉచిత వైద్య శిబిరం

**పెద్దపంజాణి, డిసెంబర్ 10 ప్రభాతవార్త**



మండలం లోని లింగాపురం సర్పంచ్ రుద్రమూర్తి నాయుడు అధ్వర్యంలో బుధవారం లింగాపురంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. తిరుపతి రమాదేవి ఆస్పత్రికి చెందిన డా॥ రఘునాథన్ బృందం ఈ శిబిరంకు హాజరై సుమారు 120మందికి వైద్య పరీక్షలు నిర్వహించి పలువురికి ఉచితంగా మందులు, మాత్రలు పంపిణీ చేశారు. అవసరమైన వారిని శస్త్రచికిత్సల నిమిత్తం ఎంపిక చేశారు. ఈసందర్భంగా గ్రామస్తులు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటుచేసిన సర్పంచ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. వైద్యబృందాన్ని సర్పంచ్ రుద్రమూర్తి నాయుడు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రెడ్డివారి విజయభాస్కర్‌రెడ్డి, పిఏసిఎస్ డైరెక్టర్ శ్రీరాములు, నేతలు సుధాకర్‌రెడ్డి, చలపతి, ఎఎంసిడైరెక్టర్ శంకరప్ప పాల్గొన్నారు.

## పెద్దపంజాణి ఎస్సైగా మారెప్ప



**పెద్దపంజాణి, డిసెంబర్ 10 ప్రభాతవార్త** పెద్దప ంజాణి మండల నూతన ఎస్సైగా మారెప్ప బుధవారం బాధ్యతలుచేపట్టారు. ప్రొబేషనరీ శిక్షణ ముగిసిన అనంతరం జిల్లా ఎస్పీ తుషార్ డూడీ ఎస్సైగా మారెప్పను నియమించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఎస్పీఆదేశాలతో మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు తొలి ప్రాధాన్యత ఇస్తామన్నారు. మండలంలో చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై ఉక్కుపాద ం మోపుతామన్నారు. ప్రజలు కూడా సహకరించాలని కోరారు.

## భాజపా బలోపేతంకు కృషి చేయాలి

**కుప్పం, డిసెంబర్ 10 ప్రభాతవార్త**



గ్రామీణప్రాంతాల్లో భారతీయ జనతా పార్టీ బలోపేతానికి పార్టీ శ్రేణులు పనిచేయాలని నియోజకవర్గ బిజెపి ఇన్‌చార్జ్ తులసినాథ్, జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ్ కోరారు. బుధవారం పైపాళ్యంలో మండల పార్టీ అధ్యక్షుడు వడివేలు అధ్యక్షతన జరిగిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. త్వరలో జరిగే స్థానిక ఎన్నికలకు సన్నద్ధం కావాలని, కూటమి అభ్యర్థుల గెలుపుకు కృషి చేయాలని కోరారు. ఎన్డీయే ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల్లో తీసుకెళ్లాలని కోరారు.

## భూసారాన్ని గుర్తించే విధానాన్ని బోధించిన ఏ ఓ

**బైరెడ్డిపల్లి, డిసెంబర్ 10 ప్రభాతవార్త**

:బైరెడ్డిపల్లి మండల కడపనత్తం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలనందు మట్టి నమూనాలను సేకరించే విధానం,భూసార పరీక్ష ఆవశ్యకత, తద్వారా ఫలితాలఆధారంగా ఎరువుల వాడకం, సేంద్రియ ఎరువుల వినియోగం ప్రాముఖ్యత, తద్వారా భూస్వారాన్ని కాపాడుట గురించి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమాన్ని బైరెడ్డిపల్లి మండల అగ్రికల్చర్ ఆఫీసర్ గీతా కుమారి ఆధ్వర్యంలో జడ్పీ హైస్కూల్ విద్యార్థినీ విద్యార్థులకు బోధించడం జరిగినది. అదేవిధంగా ఈ కార్యక్రమాన్ని బోధించడానికి అగ్ర కల్చర్ ఆఫీసర్ మాధవి జిల్లా ట్రైనింగ్ సెంటర్ నుండి రావడం జరిగినది. ఈ సందర్భంగా ఏవో గీత కుమారి మాట్లాడుతూ,భూసారాన్ని గుర్తించి సేంద్రియ ఎరువులను వాడినట్లయితే భూమి సారవంతంగా తయారై,విరివిగా పంటలు పండి అధిక దిగుబడులు సాధించవచ్చునని,అందువలన రైతులు భూమిని సారవంతమైనదా కాదా అని గుర్తించి, ఎరువుల వాడకాన్ని తగ్గించాలని,సేంద్రియ ఎరువులను వాడాలని ఈ సందర్భంగా తెలియజేశారు.

## కర్ణాటకలో కార్యక్రమాలు పరిశీలించిన ఎంపిడిఒ

**శాంతిపురం, డిసెంబర్ 10 ప్రభాతవార్త**



ప్రభుత్వ ఆదేశాల మేరకు కర్ణాటక రాష్ట్రంలో అమలవు తున్న పంచాయ తీరాజ్, గ్రామీణాభివృద్ధి కార్యక్రమా లు, సంక్షేమ పథకాలను శాంతిపురం ఎంపిడిఒ పిఆర్ కుమార్ క్షేత్రస్థాయిలో పరిశీలిం చారు. మైసూర్ జిల్లా గర్గేశ్వరి గ్రామ పంచాయతీలో ఆయన రికార్డుల పరిశీలన, కార్యక్రమాల పర్యవేక్షణ, పౌర సేవల గురించి అడిగి తెలుసుకున్నారు.కార్యక్రమంలోఎన్ఐఆర్‌డి ప్రకాష్, పిడిఒ, బృంద సభ్యులు పాల్గొ న్నారు.

## ముఖ్యమంత్రిని కలిసిన మార్కెట్ కమిటీ ఛైర్మన్

**పలమనేరు, డిసెంబర్ 10, ప్రభాతవార్త:**



పలమనేరు మార్కెట్ కమిటీ ఛైర్మన్ రాజన్న బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కలిశారు. అమరావతి క్యాంపు కార్యాలయంలో కలిసి పలమనేరు మార్కెట్ కమిటీ సమస్యలు వివరించారు. పలమనేరు సమీపంలో 33 ఎకరాల్లో ఏర్పాటు చేయనున్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్ కమిటీకి అన్ని విధాల సహకరించాలని, అన్ని సదుపాయాలు కల్పించి దేశంలోనే నెంబన్ 1 గా తీర్చాదిద్దాలని కోరారు. ఈ మార్కెట్ కమిటీ అందుబాటులోకి వస్తే చెన్నై, బెంగుళూరు పాటు ఇతర రాష్ట్రాలకు కూరగాయల ఎగుమతికి అనుకూలంగా వుంటుందని వివరించారు.

## డిఆర్డిఏ పీడిచే తనిఖీ

**సదుం డిసెంబర్ 10 ప్రభాతవార్త:**



సదుం మండల మహిళా సమైక్య కార్యాలయంలో ఖిమోడల్ మండల విజన్ బిల్డింగ్‌ఖి పైన వివో అధ్యక్షురాలకు జరుగుతున్న శిక్షణ కార్యక్రమాన్నీ డిఆర్డిఏ పీడీ శ్రీదేవి బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్బంగా శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలించారు. అనంతరం సంఘమిత్రలతో సమావేశమై మండ లంలో వెలుగు ద్వారా జరుగుతున్న వివిధ కార్యక్ర మాల పై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి జిల్లా ఐబీడీపీఎం సుబ్బారెడ్డి , బి ఎల్ డి పి ఎం శ్రీహరి, శ్రీనిధి ఏజీఎం వేణు, మండల ఏపిఎం హరి ప్రసాద్, సీసీలు, సంఘమిత్రలు, వివో అధ్యక్షురాలు హాజరైనారు.

## అభివృద్ధికి దిక్సూచిగా కూరపాటి శంకర్ రెడ్డి

– కువ్వాకొలి పంచాయితీ భవన నిర్మాణానికి భూమి పూజ



**వరదయ్యపాలెం, డిసెంబర్ 10, ప్రభాతవార్త** సత్యవేడు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ అభ్యున్నతికి, ఈ ప్రాంత అభివృద్ధి దిశగా ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ కూరపాటి శంకర్ రెడ్డి తనదైన పంథాలో దూసుకెళ్తున్నారు. నియోజకవర్గ అభివృద్ధికి దిక్సూచిగా నిలుస్తున్న శంకర్ రెడ్డికి పార్టీ శ్రేణుల్లో, ప్రజల్లో అనతికాలంలోనే మంచి గుర్తింపు ఆదరణ లభించదని చెప్పవచ్చు. బుధవారం వరదయ్యపాళెం మండలంలోని కువ్వాకొల్లి గ్రామంలో పంచాయితీ భవన నిర్మాణానికి నాయకులు, గ్రామ పెద్దలతో కలిసి శంకర్ రెడ్డి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ ప్రియతమ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించిన మేరకు నియోజకవర్గ అభివృద్ధికి రాజీ లేకుండా కృషి చేస్తామని పెర్కొన్నారు.ముఖ్యంగా బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి, అర్హులందరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయడంలో ప్రధాన లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వరదయ్యపాలెం మండలం టిడిపి పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## సచివాలయం మార్చాలంటూ మంత్రికి వినతి

**సదుం డిసెంబర్ 10 ప్రభాతవార్త**



గత ప్రభుత్వంలో రెండు పంచాయతీలు కలిపి ఒక సచివాలయాన్ని ఏర్పాటు చేశారని ఆ పద్ధతిని మార్చి ఒక సచివాలయానికి ఒక గ్రామపంచాయతీ ఏర్పాటు చేయాలంటూ సదం మండల తెలుగుదేశం పార్టీ నాయకుడు వై వెంకటరమణారెడ్డి రాష్ట్ర మంత్రి బీసీ జనార్దన్ రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. గత వైకాపా ప్రభుత్వంలో ఎర్రతివారిపల్లె మరియు తాటికుంటపాలెం రెండు గ్రామపంచాయతీలను కలిపి యర్రాతివారిపల్లె సచివాలయంలో ఏర్పాటు చేశారు .తాటిగుంటపాలెం నుంచి ఎర్రాతి వారిపల్లెకి వెళ్లాలంటే మధ్యలో సదుం గ్రామపంచాయతీని దాటుకొని వెళ్లాల్సి వస్తోందని ఆయన పేర్కొన్నారు. తాము గతంలో పలుమార్లు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లిన ఫలితం లేకుండా పోయిందని ఇప్పుడు కూటమి ప్రభుత్వం స్పందించి తమకు ప్రత్యేక సచివాలయాన్ని కేటాయించాలని ఆయన మంత్రిని కోరారు.

## ఉచిత చక్కెర వ్యాధి పరీక్ష శిబిరంకు విశేష స్పందన

**కుప్పం, డిసెంబర్ 10 ప్రభాతవార్త**



జైన్ హాస్పిటల్స్ వారి అధ్వర్యంలో బుధవారం కుప్పం ఏరియా ఆస్పత్రిలో నిర్వహించిన ఉచిత చక్కెర వ్యాధి పరీక్ష శిబిరంకు విశేష స్పందన లభించింది. వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన ప్రజలకు వైద్యులు చక్కెర, రక్తపోటు, ఇతర పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరాన్ని ప్రభుత్వ విప్, కడ పిఏసి ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్, పికెఎం ఉడా ఛైర్మన్ డా॥బిఆర్ సురేష్‌బాబు పరిశీలించారు. శిబిరంకు హాజరైన వైద్యులతో చర్చించారు. కార్యక్రమంలో స్థానిక ఏరియా ఆస్పత్రి వైద్యులు పాల్గొన్నారు.

## సచివాలయాల వద్ద ఇ-సైకిళ్ల ప్రదర్శన

**కుప్పం, డిసెంబర్ 10 ప్రభాతవార్త**



కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (కడ) ద్వారా ప్రజలకు తక్కువ ధరకే ఇ – సైకిళ్లను అందించాలని సిఎం చంద్రబాబునాయుడు నిర్ణయించారు. దీనిపై ప్రజలకు విస్తృత అవగాహనకల్పిస్తున్నారు. బుధవారం కొత్తపేట సచివాలయం వద్ద ఇ – సైకిళ్లను నేతలు ప్రదర్శించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జ్ కన్నన్, కార్పొరేషన్ డైరెక్టర్ తిరుమగళ్, కొత్తపేట ఇన్‌చార్జ్ అప్పు, నేతలు కృష్ణన్, మురళి,ఉదయ్‌కుమార్, కృష్ణ, హరినాథ్‌గౌడ్ పాల్గొన్నారు.

## డికెపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి సమస్య పరిష్కరించాలి

**కుప్పం, డిసెంబర్ 10 ప్రభాతవార్త**



స్థానిక డికెపల్లి వద్ద గల రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద నెలకొన్న సమస్యను పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ ఛైర్మన్ సెల్వరాజ్‌కు స్థానిక నేతలు వినతిపత్రం అందించారు. వర్షం పడితే ఈ ప్రాంతంలో నీళ్లు నిల్వ చేరి రాకపోకలకు తీవ్ర అంతరాయం కలగడంతో పాటు ప్రజల రాకపో కలకు ఇబ్బందిగామారుతోందన్నారు. సమస్యను పరిష్కరించాలని కోరారు. అనంతరం మున్సిపల్ ఛైర్మన్ డికెపల్లి అండర్ బ్రిడ్జి ప్రాంతాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో కార్పొరేషన్ డైరెక్టర్ వేణుగోపాల్, నేతలు అశోక్, లోకేష్,మల్లయ్యనాయుడు, సురేష్, దేవా తదితరులు పాల్గొన్నారు.

## ట్రేడ్ లైసెన్సులకు ఆన్‌లైన్ చెల్లింపులు చేయవద్దు - కమీషనర్

**కుప్పం, డిసెంబర్ 10 ప్రభాతవార్త**



కుప్పం మున్సిపల్ పరిధిలో వ్యాపారులకు సంబంధించి ట్రేడ్ లైసెన్సులకు గాను గూగుల్‌పే, ఫోన్‌పేలో నగదు చెల్లింపులు చేయాలని ఫోన్‌కాల్స్ వస్తే ప్రజలు నమ్మి మోసపోరాదని మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసరావు పేర్కొన్నారు. వ్యాపారులు ఇలాంటి వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలనా న్నరు. మున్సిపల్ అధికారులు, సిబ్బంది ఎవరూ ఫోన్లు చేయడం లేదన్నారు. ట్రేడ్ లైసెన్సులకు గాను నేరుగా చెల్లింపులు మున్సిపల్ కార్యాలయంలో చేయాలని కోరారు.

## గణితశాస్త్రంలో ఉదయ్‌కు పిహెచ్‌డి ప్రదానం

**శాంతిపురం, డిసెంబర్ 10 ప్రభాతవార్త**



శాంతిపురం మండలంకు చెందిన వెంకటాచలపతి ఉదయ్ తమిళనాడు సన్‌రైజ్ యూనివర్సిటీ నుంచి గణితశాస్త్రంలో పిహెచ్‌డి పట్టాను పొందారు. ఈయన ఆధునాతన గణిత అవగాహన మరియు ఇంపల్సివ్ డిఫరెన్షియల్ సమీపక రాణాల డైనమిక్స్‌ను అన్వేషించడం అనే పరిశోధన పత్రా న్ని ఉదయ్ డా॥ గౌతమ్ కుమార్ రాజ్‌పుట్ నేతృత్వంలో విజయ వంతంగా సమర్పించారు. ఉదయ్‌కు డాక్టరేట్ రావడం పట్ల స్థానికులు, కుటుంబీకులు అభినందించారు.

## కుప్పంలో పవర్ ప్రాజెక్టు ఏర్పాటుకు చర్యలు

### ఏపీఐఐసీ డైరెక్టర్ ప్రేమ్ కుమార్

**కుప్పం ,డిసెంబర్ 10 ప్రభాతవార్త**



సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాలతో కుప్పంలో పవర్ ప్లాంట్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఏపీఐఐసి డైరెక్టర్ ప్రేమ్ కుమార్ తెలిపారు. బుధవారం ఆయన బెంగళూరు నగరంలోని ఇన్ ఫేస్ పవర్ టెక్నాలజీస్ సంస్థ సీఈవో పన్నాలాల్ బిస్వాస్ ను కలిసి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుప్పంలో పవర్ ప్లాంట్ ఏర్పాటుకు ముందుకు రావాలని సీఈవోను కోరగా ఆయన సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. త్వరలోనే ఇన్ ఫేస్ సంస్థతో మౌఖిక ఒప్పందం సైతం కుదుర్చుకుంటామని ఆయన తెలిపారు. ఈ పరిశ్రమ ఏర్పాటుతో కుప్పం ప్రాంతంలో నిరుద్యోగ యువతీ యువతకు మంచి ఉపాధి అవకాశాలు లభిస్తాయి అన్నారు.

## విద్యార్థులు క్రీడలపై మక్కువ పెంచుకోవాలి



ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్

**కుప్పం,డిసెంబర్ 10 ప్రభాతవార్త**

విద్యార్థులు విద్యతో పాటు క్రీడలపై మక్కువ పెంచుకోవాలని ప్రభుత్వ విప్, కడ పిఏసి ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకా ంత పేర్కొన్నారు. బుధవారం స్థానిక వైసి జేమ్స్ ఎన్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజ్‌లో ఇంటర్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్‌మీట్‌ను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో మానసికోల్లాసం సాధ్యమవుతుందన్నారు. విద్యతో పాటు క్రీడల్లోను విద్యార్థులు రాణించితే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. క్రీడల ప్రోత్సాహకానికి సిఎం చంద్రబాబునాయుడు చర్యలు చేపట్టారన్నారు. కుప్పంలో సైతం 22కోట్ల నిధులతో తొలివిడత ఎన్టీఆర్ స్పోర్ట్స్ స్టేడియం పనులు మొదలు పెట్టామన్నారు. క్రీడాకారులకు తమవంతు సహకారం ఉంటుంద న్నారు. విద్యార్థుల ఉత్సాహం చూసి తన కాలేజ్ రోజులు గుర్తుకు వస్తున్నాయన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, పికెఎంఉడా ఛైర్మన్‌డా॥ బిఆర్‌సురేష్‌బాబు, రెస్కో ఛైర్మన్ ప్రతాప్‌కుమార్, మాజీ మున్సిపల్‌ఛైర్మన్‌డా॥ సుధీర్, కౌన్సిలర్ జిమ్‌దాము, ప్రిన్సిపాల్ రామకృష్ణారావు, అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

## పల్స్ పోలియో విజయవంతం కావాలి

**పుంగనూరు రూరల్, డిసెంబర్ 10 ప్రభాతవార్త**



21న జాతీయ పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో అప్పాజీ సూచించారు. స్థానిక మండల కార్యాలయంలో బుధవారం వైద్య సిబ్బందితో ఆయన మాట్లాడారు. ఐదేళ్ళ లోపు పిల్లలకు పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయాలని సూచించారు. పోలియోపై తల్లిదండ్రుల్లో అవగాహన కల్పించా లని ఆదేశించారు. పి హెచ్ సి డాక్టర్ సృజన, ఐసీడీఎస్ సూపర్వైజర్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

## దళితుడిపై దాడి దారుణం



**పుంగనూరు రూరల్, డిసెంబర్ 10 ప్రభాతవార్త**

పెంచుపల్లికి చెందిన జనార్ధన 55 దళితుడుపై జరిగిన దాడిపై మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్ ఆర్ అశోక్ తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జనార్ధనను అశోక్ బుధవారం పరామర్శించారు. కొండసముద్రానికి చెందిన ఆంజప్ప, కుటుంబ సభ్యులు కలిసి కులం పేరుతో దూషిస్తూ బీరు బాటిల్‌తో దాడి చేసినట్లు ఎన్ ఆర్ అశోక్ తెలిపారు. ఈ ఘటనపై పోలీసులు వెంటనే ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు మరియు హత్యాయత్నం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు, కార్యక్రమంలో నాగరాజు, గంగా, మంజు, బాబు, కృష్ణప్ప, సుధాకర్, వెంకటేష్, జయమ్మ, వేణు పాల్గొన్నారు.

## త్వరలో జనసేన భారీ బహిరంగ సభ

**పుంగనూరు డిసెంబర్ 10 ప్రభాతవార్త**



నియోజకవర్గంలో త్వరలో జనసేన భారీ బహిరంగ సభకు రాష్ట్ర పార్టీ ప్రధాన కార్యాలయం అంగీకరించిందని పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి చిన్నా రాయల్ తెలిపారు. బుధవారం పార్టీ నియోజకవర్గ నాయకులు మంగళగిరి లో పార్టీ రాష్ట్ర కార్యదర్శి తాళ్లూరి రామ్ ను కలిశారు. ఇన్చార్జ్ సిరివేలు చిన్నా రాయల్, నియోజకవర్గ నాయకులు కోలా సోమశేఖర్,, పుంగనూరు పిఏసిఎస్ ఛైర్మెన్ పగడాల రమణ, రొంపిచర్ల మార్కెట్ డైరెక్టర్ రెడ్డి శివ రాయల్, మర్యాదపూర్వకంగా ఆయనను కలసి నియోజకవర్గంలో జరగబోవు కార్యక్రమాలపై సుదీర్ఘంగా చర్చించారు. స్థానిక ఎన్నికలు, నియోజకవర్గ కమిటీలపై చర్చించి త్వరలో కోలా సోమశేఖర్ ఆధ్వర్యంలో ఒక భారీ బహిరంగ సభ ఏర్పాటు చేయాలని రామ్ తాళ్లూరి సూచించినట్లు వారు తెలిపారు.

## " సహకరిస్తున్నాం బాగోగులు పట్టించుకోండి... : రాఘవరెడ్డి

–డిస్కం ప్రధాన కార్యదర్శిగా మురళీధర్

**చౌడేపల్లి, డిసెంబర్ 10 ప్రభాతవార్త**



ప్రభుత్వానికి అన్ని విదాలా సహకరిస్తున్నామనీ, విద్యుత్‌శాఖలోని కార్మికుల బాగోగులను పట్టించు కోండని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ –327 రాష్ట్ర సెక్రటరీ జనరల్ యం.వి.రాఘవరెడ్డి అన్నారు. మండలంలోని దిగువపల్లి పంచాయతీ భవానీనగర్‌లో డిస్కం స్థాయి సర్వసభ్య సమావేశం జరిగింది. గతంలో జెఏసి ఆదేశాలను యాజమాన్యం కొన్నింటిని వాయిదా వేసింది. ఒప్పంద కార్మికులకు సంబంధించిన పదవీ విరమణ, వైద్య ప్రయోజనాలను వాయిదా వేశారన్నారు. వీటి కోసం యాజమాన్యంతో చర్యలు జరుపుతున్నామన్నారు. 1998లో సంస్కరణల సందర్భంగా అలనాటి ఐఎన్‌టియుసి నాయకుడు సంజీవరెడ్డి ఈనాటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుల ఆధ్వర్యంలో విద్యుత్ ఉద్యోగులు సుఖ, సంతోషాలతో వున్నారన్నారు. ఒప్పంద ఉద్యోగులకు పనికి తగ్గ వేతనం విషయంలో యాజమాన్యం రాతమూలకంగా అంగీకారం తెలిపిందనీ, ఈ విషయంలో ముఖ్యమంత్రి చొరవ తీసుకొని న్యాయం చేయాలన్నారు. రాష్ట్ర మంత్రి పయ్యావుల కేశవ్ విద్యుత్ ఉద్యోగులు పడే కష్టాలను కళ్ళకు కట్టినట్లు చెప్పడం ఆనందదాయకమన్నారు. అనంతరం డిస్కం స్థాయి ఏకగ్రీవ ఎన్నికలు జరిగాయి. డిస్కం ప్రధాన కార్యదర్శిగా ఆర్.మురళీధర్, అధ్యక్షుడుగా లక్ష్మీకాంతరెడ్డి, కోశాధికారిగా గోపీనాథ్, కార్యనిర్వాహక అధ్యక్షుడుగా ప్రహ్లాదాచారి, ఉపాధ్యక్షుడుగా చలపతి, జయానాయక్, హరినాథ్‌రెడ్డి, దాదాపీర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. ఎన్నికల పరిశీలకులుగా వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావులు వ్యవహరించారు. పుంగనూరు డివిజన్‌లో పలువురు విద్యుత్ ఉద్యోగులు 327లోకి చేరారు. డిస్కం అధ్యక్షుడు రాఘవేంద్ర ప్రసాద్, ఐఎన్‌టియుసి అధ్యక్షుడు రత్నకుమార్, భాస్కరరావు, డిస్కం, రీజనల్, డివిజనల్‌ల నుంచి 327 సంఘ నాయకులు పాల్గొన్నారు.

## ఆడిఆర్‌పిఎస్ పట్టణ అధ్యక్షుడుగా సతీష్

**చౌడేపల్లి, డిసెంబర్ 10 ప్రభాతవార్త**



రాష్ట్ర దాసరి రిజర్వేషన్ పోరాట సమితి పట్టణాధ్యక్షుడుగా గోవిందుగారి సతీష్ నియమితులయ్యారు. స్థానికంగా జరిగిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు పూసల రవి నియామక పత్రాన్నందించాడు. ప్రభుత్వానికి సంఘానికి మధ్యలో వారధిలా వుంటూ దాసరి కులస్తులు ఎదుర్కొంటున్న సమస్యల సాధనకు కృషి చేస్తానని ఈ సందర్భంగా సతీస్ అన్నాడు. జిల్లా, రాష్ట్ర కమిటీల పిలుపు మేరకు సంఘాన్ని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేస్తామ న్నారు. సమితి సభ్యులు శంకరయ్య, జి.శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

## వైసిపి కోటి సంతకాల ఉద్యమం విజయవంతం



సంతకాల ప్రతులు చిత్తూరుకు తరలింపు

**పలమనేరు, డిసెంబర్ 10, ప్రభాతవార్త:**

ప్రభుత్వ వైద్యకళాశాలల ప్రైవేటీ కరణకు నిరసనగా పలమనేరు నియోజకవర్గంలో వైసిపి చేపట్టిన కోటి సంతకాల ఉద్యమం విజయవంతమైంది. సంతకాల ప్రతుల బాక్సులు చిత్తూరు వైసిపి ప్రధాన కార్యాయం చేరాయి. బుధవారం పలమనేరు వైసిపి కార్యాలయం వద్ద మాజీ ఎంఎల్ఎ వెంకటేగౌడ జెండా వూపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకటేగౌడ మాట్లాడుతూ వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా వున్న సమయంలో చేపట్టిన మెడికల్ కళాశాలలను ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కక్షసాధింపుతో ప్రవేటు పరం చేస్తున్నారని ఆరోపించారు. ఇందుకు నిరసనగా వైసిపి రాష్ట్ర వ్యాప్తంగా కోటి సంతకాలు ఉద్యమం చేపట్టిందన్నారు. ఇందులో భాగంగా పలమనేరు నియోజకవర్గంలో ప్రజలను చైతన్య వంతులను చేసి 72 వేల సంతకాలు సేకరించామని సంతకాల ప్రతులను వైసిపిరాష్ట్రకార్యదర్శిదయానందగౌడ్‌ఆధ్వర్యంలోజిల్లాఅధ్యక్షుడుభూమనకరుణాకరరెడ్డికిఅందజేశామన్నారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల సీనియర్ నాయకులు, వైసిపిశ్రేణులు పాల్గొన్నారు.

## ధోబి ఘాట్ పనులు త్వరగా పూర్తి చేయండి

**సదుం డిసెంబర్ 10 ప్రభాతవార్త** సదుం గ్రామ పంచాయతీ పరిధిలోని కుమారునీ ఒడ్డు చెరువు వద్ద బీసీ కార్పొరేషన్ నిధులతో నిర్మిస్తున్న ధోబి ఘాట్ పనులను బుధవారం డిఆర్డిఏ పిడి శ్రీదేవి తనిఖీ చేశారు. ఆమె పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని చెప్పారు. ప్రస్తుతం జరుగుతున్న పనులకు పది లక్షల రూపాయలు మంజూరు అయినట్లు ఆమె తెలిపారు. ఎంపీ నిధుల కింద 25 లక్షలు తో కమ్యూనిటీ హాల్ నిర్మాణం పూర్తయిందని ప్రారంభోత్సవం కూడా జరిగిందని చెప్పారు. ప్రస్తుతం నిర్మిస్తున్న ధోబి ఘాట్ పనులు త్వరగా పూర్తిచేసి ప్రారంభించాలని చెప్పారు. ఆమె వెంట రజక సంఘం నాయకులు గోపాల్, నవీన్, పద్మావతి, ఏపీఎం హరిబాబు తదితరులు పాల్గొన్నారు.



## హ్యూమన్ రైట్స్‌పై అవగాహన అవసరం:జూనియర్ సివిల్ జడ్జి



**శ్రీకాళహస్తి, డిసెంబర్ 10 ప్రభాతవార్త**సమాజంలో రోజు రోజుకు చోటు చేసుకుంటున్న సంఘటనలతో హ్యూమన్‌రైట్స్‌కు సంబంధించి సమగ్ర అవగాహన ఉండాలని జూనియర్ సివిల్ జడ్జి కృష్ణప్రియ పిలుపు నిచ్చారు. బుధవారం శ్రీకాళహస్తిలోని కోర్టు సముదాయంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆమె ముఖ్యఅతిథిగా హాజరై పలు సూచనలు చేసారు. హ్యూమన్‌రైట్స్‌డే సందర్భంగా 12వ అదనపు జిల్లా జడ్జి ఆదేశాల మేరకు సబ్‌జైలును సందర్శించినట్లు ఆమె వివరించారు. ఇక్కడ కూడా ఖైదీలకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. ప్రభుత్వం రూపొందిస్తున్న చట్టాలపై ప్రజలకు అవగాహన లేనందువల్ల సత్ఫలితాలు ఇవ్వటం లేదన్నారు. ఈ సమావేశంలో న్యాయవాదులు, సబ్‌జైల్ సిబ్బంది, కోర్టు సిబ్బంది, పారాలీగల్ వాలంటీర్లుపాల్గొన్నారు. ఈ సందర్భంగా పట్టణంలో ర్యాలి నిర్వహించారు. మరిన్ని న్యాయ సేవా సలహాల కోసం 15100కు సంప్రదించాలని కోరారు.

## శ్రీశ్రీ నగర్ కాలనీలో వీధిలైట్లు ఏర్పాటు



**తొట్టంబేడు, డిసెంబర్ 10 ప్రభాతవార్త** తొట్టంబేడు పంచాయతీ పరిధిలోని శ్రీశ్రీ నగర్ కాలనీలో పంచాయతీ సర్పంచ్ కొత్త విద్యుత్ దీపాలను ఏర్పాటు చేసారు. బుధవారం సర్పంచ్ పంచాయతీ కార్యదర్శులు సంయుక్తంగా ఇటీవల కురిసిన వర్షాలతో మరమ్మత్తులకు గురైన వీధి లైట్లను చక్కదిద్దారు. గ్రామంలో రాత్రివేళల్లో ఎలాంటి ఇబ్బందిలేకుండా వీధి లైట్లను ఏర్పాటు చేసారు. ఇక ప్రజల ఇబ్బందులు తొల గినట్లు అని సర్పంచ్ వివరించారు. అభివృద్ధి పనుల్లో సర్పంచ్ సుబ్బయ్య చొరవను ప్రజలు అభినందిస్తున్నారు. తమ పంచాయతీలోని శ్రీ శ్రీ నగర్ కాలనీలో విద్యుత్ వెలుగులు అందించిన ఎంపిడిఓకు ధన్యవాదాలు తెలిపారు.

## సన్మానం



**తొట్టంబేడు, డిసెంబర్ 10 ప్రభాతవార్త**శ్రీకాళహస్తిలోని విద్యాప్రకాశానంద ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలోజూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తూ పదోన్నతిపై నాగలాపురం కళాశాలకు బదిలి అయిన కందాటి విశ్వేశ్వరరెడ్డిని బుధవారం కళాశాల అధ్యాపకులు సన్మానించారు. విశ్వేశ్వరరెడ్డి ఎంతో కాలం ఇక్కడ పని చేసినప్పటికి ప్రతి ఒక్కరికి సహకరిస్తూ విద్యార్థులకు అధ్యాపకులకు సమన్వయ కర్తగా వ్యవహరించారని పలువురు ప్రశంసించారు. ఈ సన్మాన కార్యక్రమాల్లో అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

## రూరల్ ఎస్ఐగా వెంకటేష్



**శ్రీకాళహస్తి రూరల్, డిసెంబర్ 10 ప్రభాతవార్త**శ్రీకాళహస్తి రూరల్ ఎస్ఐగా వెంకటేష్‌ను నియమిస్తూ జిల్లా ఎస్పి ఉత్తర్వులు జారి చేసారు. బుధవారం రూరల్ ఎస్ఐగా వెంకటేశ్ బాధ్యతలు స్వీకరించారు. ఆయన గతంలో పిచ్చాటూరులో పని చేస్తూ సాధారణ బదిలీల్లో ఇక్కడకు బదిలి అయ్యారు. ఇక్కడ పని చేస్తూన్న నరసింహారావు అలిపిరికి బదిలి అయ్యారు. ఆయన్ను ఇన్‌చార్జి సిఐ నాగార్జున్‌రెడ్డి సత్కరించారు. నరసింహారావబాధ్యతలను వెంకటేష్‌కు అప్పగించారు.

## శ్రీకాళహస్తి తహాశీల్దార్ బదిలి

**శ్రీకాళహస్తిరూరల్, డిసెంబర్ 10 ప్రభాతవార్త** శ్రీకాళహస్తి తహాశీల్దార్‌గా పని చేస్తున్న జనార్థన్ రాజును తిరుపతి రూరల్ మండలానికి బదిలి చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారి చేసారు., అయితే ఆయన స్థానంలో ఎవ్వరిని నియమించలేదు. శ్రీకాళహస్తి మండలంలో 46 పంచాయతీలు 66 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. అంతేకాక ఓ వైపు రాజీవ్‌నగర్ సర్వే జరుగుతుంది. సింహాచల కండ్రిగలో రైతులు, అటవీశాఖ అధికారులకు వివాదాలు, ఫ్రీహోల్డ్ భూములకు సంబందించిన వివాదాలు చోటు చేసుకున్నాయి. జనార్ధన్‌రాజు స్వల్ప కాలం మాత్రమే పని చేసారు. ఇన్ని సమస్యలున్న మండాలనికి పని చేస్తున్న అధికారిని బదిలి చేసి ఇక్కడ ఎవ్వరిని నియమించకపోవటంపై విమర్శలు చోటు చేసుకున్నాయి.

## గంగమ్మలను దర్శించుకున్న ఎన్‌జిఓ నాయకుడు



**శ్రీకాళహస్తి, డిసెంబర్ 10 ప్రభాతవార్త** శ్రీకాళహస్తిలోని ఏడుగంగమ్మల జాతర సందర్భంగా ఏడు గంగమ్మలను రాష్ట్ర ఎన్‌జిఓ నాయకుడు చెంచురత్నం యాదవ్ దర్శించుకొని పూజలు జరిపించారు. వెళ్ళిన చోట వారికి సాదరంగా కమిటి నిర్వాహకులు స్వాగతం పలికి ఆశీర్వదించారు. తేరువీధిలోని బాపన వీధి గంగమ్మ వద్దకు రాగా ఆయనకు నిర్వాహకులు పశుపతి గురుకుల్ సాదరంగా స్వాగతం పలికారు. వారికి అమ్మవారి ప్రసాదం అందించారు.

## పుత్తూరులోనే వెహికల్ ఫిట్‌నెస్ కేంద్రం

మంత్రికి విజయ్‌బాబు కృతజ్ఞతలు

***పుత్తూరు, డిసెంబరు 10 ప్రభాతవార్త :*** తన అభ్యర్థన మేరకు పుత్తూరు పట్టణంలోని మోటారు వాహనాల తనిఖీ అధికారి కార్యాలయంలో వెహికల్ ఫిట్‌నెస్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినందుకు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డికి తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పోతుగుంట విజయ్‌బాబు బుధవారం ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక ఫిట్‌నెస్ సెంటర్‌ను బంగారుపాళెంకు తరలించడం వల్ల నగరి నియోజకవర్గంలోని వివిధ వాహనాల యజమానులు తీవ్ర ఇబ్బందులకు గురవడమే కాకుండా ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందని ఈ నెల వ తేదీన విజయ్‌బాబు ఫోన్ ద్వారా మంత్రి దృష్టికి తీసుకువెళ్లిన సంగతి తెలిసిందే. అలాగే తిరుపతిలోని జిల్లా రవాణా శాఖాధికారికి కూడా ఈ విషయమై వినతిపత్రం సమర్పించారు. ఈ నేపథ్యంలో పుత్తూరులోనే వెహికల్ ఫిట్‌నెస్ సెంటర్ ఏర్పాటు చేస్తూ మంత్రి ఆదేశాలు జారీ చేశారు.

## నూతనంగా ఎంపికైన డిఎస్సి ఉపాధ్యాయులకు సేవా పుస్తకాలు పంపిణీ



***వరదయ్యపాలెం, డిసెంబర్ 10, ప్రభాతవార్త*** యుటిఎఫ్ వరదయ్యపాలెం శాఖ ఆధ్వర్యంలో నూతనంగా ఎంపిక కాబడిన డీఎస్సీ 2025 ఉపాధ్యాయుని ఉపాధ్యాయులకు 11 మందికి సేవా పుస్తకాన్ని అందించారు. యుటిఎఫ్ సభ్యులుగా చేర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి సురేష్ భగవాన్ మాట్లాడుతూ మన పాఠశాలను బలోపేతం చేయాలని నూతన ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు శశి కుమార్, బుష్యేంద్ర బాబు, తిరుపతి నాయుడు కొండలరావు, గోవిందరావు, వెంకట్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలను అధికమిస్తే సర్వతో ముఖాభివృద్ధి : ఏపీఎం



**బుచ్చినాయుడు కండ్రిగ, డిసెంబరు 10 ప్రభాతవార్త:** ఆదర్శ గ్రామాలు ఏర్పాటు జరుగుతున్న శిక్షణ కార్యక్రమంలో భాగంగా బుచ్చినాయుడు కండ్రిగలో బుధవారం ఏపీఎం మునెయ్య మొదటి రోజు శిక్షణను సమీక్షించి అనంతరం సభ్యులను మూడు గ్రూపులుగా ఏర్పాటు చేసి వారిలో గత 25 సంవత్సరాలుగా ఎన్ని విజయాలు సాధించారో ఒక్కొక్క విజయానికి ఒక దారం ఇచ్చి వారి వేలికి చుట్టుకోవడం జరిగింది. అనంతరం ఎక్కువ విజయాలు సాధించిన వారి నుంచి వారి అనుభవాలు పాలు పంచుకోవడం జరిగింది. అనంతరం వారి దారాలు అన్ని కలపగా పెద్ద చాంతాడులా తయారవుతుంది. తద్వారా ఒకరిగా సాధించిన విజయాలతో పాటు అందరూ కలసి ముందుకు సాగితే అద్భుతాలు చేయవచ్చునని ఈ క్రమంలో కుల, మత ప్రాంత విభేదాలు లేకుండా ఒక్క తాటిపై నిలబడవచ్చునని తెలియజేశారు. సీసీలు వెంకటరత్నం, వీరజిన్న, జీవ, అకౌంటెంట్‌లు హిమగిరిజ, శిరీష, మండల సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

## అర్చన రుచి రెస్టారెంట్ ప్రారంభోత్సవం



**సత్యవేడు, డిసెంబరు 10 ప్రభాతవార్త:** అర్చన ఫ్యామిలీ రెస్టారెంట్ నూతన ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా సత్యవేడు నియోజకవర్గ ప్రోగ్రామ్ కో–ఆర్డినేటర్ కూరపాటి శంకర్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. మాజీ ఎమ్మెల్యే హేమలత, మండల అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రణీత్‌రెడ్డి రిబ్బన్ కట్ చేశారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సభ్యులు షణ్ముగం, కృష్ణ చైతన్య, మండేలా, రవి, దిలీప్, పృథ్వీ తదితరులు పాల్గొన్నారు.

## సిమెంటు రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

**వడమాలపేట, డిసెంబరు 10 ప్రభాతవార్త:** మండలంలోని లక్ష్మమ్మకండ్రిగ పంచాయతీ కన్యకాపురం ఎస్టీ కాలనీలో 20 లక్షల రూపాయల ఎన్ఆర్‌జీఎస్ నిధులతో సిమెంటు రోడ్డు నిర్మాణానికి బుధవారం భూమి పూజ చేశారు. ఎంపీడీవో శేషగిరిరావు, పీఆర్ ఏఈ నాగేంద్ర, జడ్పీటీసీ మురళీ ధర్‌రెడ్డి, నాయకులు ధనంజయలునాయుడు, మునికృష్ణ, ఉదయ్, కుమార్, సుబ్రహ్మణ్యం నాయుడు, పురుషోత్తంనాయుడు, చంగమనాయుడు, గజేంద్ర, శివరాయల్, వినోద్, బత్తి నాయుడు, పూర్ణ, చైతన్య పాల్గొన్నారు.

## సమస్యలను అధిగమిస్తే సర్వతో ముఖాభివృద్ధి

**వడమాలపేట, డిసెంబరు 10 ప్రభాతవార్త:** సమస్యలను అధికమిస్తేనే సర్వతో ముఖాభివృద్ధి సాధించవచ్చునని వెలుగు జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ టి.శోభన్‌బాబు పేర్కొన్నారు. బుధవారం వడమాలపేట వెలుగు కార్యాలయంలో ఆదర్శ గ్రామాలు ఏర్పాటుపై జరుగుతున్న శిక్షణ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. మొదటి రోజు శిక్షణను సమీక్షించి అనంతరం సభ్యులను నాలుగు గ్రూపులుగా ఏర్పాటు చేసి వారిలో గత 25 సంవత్సరాలుగా ఎన్ని విజయాలు సాధించారో తెలుసుకుని ఎక్కువ విజయాలు సాధించిన వారి అనుభవాలు పాలు పంచుకోవడం జరిగింది. డీపీఎం వెంకటేశులు, ఏపీఎం చంద్రబాబు, సీసీలు ప్రకాష్, జయ, శివాజీ, అకౌంటెంట్ రూప, మండల సమాఖ్య ఓబీ, ఈసీ సభ్యులు పాల్గొన్నారు.

## పీర్లచావిడికి నూతన రోడ్డుమంజూరు

తిరుపతి, డిసెంబర్ 10ప్రభాతవార్త:నగరంలోని పీర్లచావిడికి కార్పొరేటర్ తాజీన్ నూతన రోడ్డునిర్మాణానికి అనుమతి మంజూరుచేశారు. 26వ వార్డులో పీర్లచావిడినుండి ఎల్‌అండ్‌బి హోటల్ వరకు స్థానికుల విజ్ఞప్తితో నూతన రోడ్డు పనులకు బుధవారం ఉదయం వైసిపి జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు ఉదయ్‌వంశీ ఆధ్వర్యంలో పూజలు చేసి పనులను ప్రారంభించారు. ఉదయ్‌వంశీ పనులు పర్యవేక్షించారు. త్వరలోనే ఈ నిర్మాణపనులుపూర్తికానున్నాయి.

## ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలో సి ఎ కోర్సు అవగాహన కార్యక్రమం



**తిరుపతి విద్య, డిసెంబర్ 10 ప్రభాత వార్త** స్థానిక బాలాజీ కాలనీలో ఉన్న ఎస్వీ ఆర్ట్స్ కళాశాల అటానమస్ ఆధ్వర్యంలో బుధవారం చార్టర్డ్ అకౌంటెంట్ కోర్సు పై అవగాహన ప్రోగ్రాం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బి కామ్ విద్యార్థులకు సీఏ కోర్సు ప్రాధాన్యం, కోర్సు నిర్మాణం, పరీక్ష విధానం, ఆర్టిఫిషియల్, భవిష్యత్తు ఉద్యోగ అవకాశాలపై విస్తృతమైన అవగాహన అందించారు. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డా ఎన్ వేణు గోపాల్ రెడ్డి విచ్చేసి మాట్లాడుతూ సీఏ వృత్తి యొక్క ప్రతిష్ఠ, అవకాశాలు, భవిష్యత్తు కెరీర్ వృద్ధిపై విద్యార్థులకు ప్రేరణాత్మక సందేశం అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఐ సి ఏ ఐ తిరుపతి బ్రాంచ్ సెక్రెటరీ కె బాలాజీ, జే గోపి విచ్చేసి మాట్లాడితూ సీఏ కోర్స్ నమోదు ప్రక్రియ, శిక్షణ వివరాలు ఐ సి ఏ ఐ కార్యకలాపాల గురించి వివరించడం జరిగింది. అదేవిధంగా సీఏ కోర్సు నమోదు ప్రక్రియ, శిక్షణ వివరాలు పరిశ్రమలో ఉన్న అవకాశాలపై విద్యార్థులకు అవగాహన ఇచ్చారు. సుమారు 200 మంది విద్యార్థులు హాజరయ్యారు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ ఓ డి మల్లికార్జునరావు కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆకాష్ ఇన్స్టిట్యూట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు బహుమతులు



**తిరుపతి విద్య, డిసెంబర్ 10 ప్రభాత వార్త** ఆకాష్ ఇన్స్టిట్యూట్ ఆధ్వర్యంలో బుధవారం తిరుపతి లోని మహతి ఆడిటోరియం వేదికగా నీట్, జె ఈ ఈ , ఆంతే , ఐ ఓ ఖ్యు ఎమ్ లాంటి పరీక్షలలో ఉత్తమ ప్రదర్శన చూపించిన విద్యార్థి విద్యార్థినీలకు బహుమతులు ప్రదానం చేసారు. ఈ కార్యక్రమంలో విశిష్ట అతిథి శ్రీ శ్రీ శ్రీ శ్రీమత్ పరమహంస ఇల్లైయా కోయిల్ కేల్విఅప్పన్ గోవింద రామానుజ చిన్న జీయర్ స్వామిగాళ్ విద్యార్థులను ఉద్దేశించి ఉపన్యసించి విద్యార్థులను ఆశీర్వదించారు. అలాగే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిదులైన ఆకాష్ ఇన్స్టిట్యూట్ సౌత్ రీజినల్ కోఆర్డినేటర్ ఇంజనీరింగ్ వింగ్ గౌ. వెంకటేష్, సీనియర్ అసిస్టెంట్ డైరెక్టర్, విజయ్ కుమార్ జేఈఈ, నీట్ ప్రిపరేషనకు విద్యార్థి కి కాలావాల్సిన బేసిక్స్ యొక్క ముఖ్య ఉద్దేశాన్ని వివరించారు. డిప్యూటీ ఎం ఈ ఓ బాలాజీ మాట్లాడుతూ, తల్లితండ్రులను గౌరవించాల్సిన విధానం, అవిశ్యకత గురించి, అలాగే ఉపాధ్యాయులను గౌరవించాల్సిన ఆవిశ్యకత గురించి వివరించారు. ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు శ్రీధర్ మాట్లాడుతూ, విద్యార్థులు క్రమశిక్షణతో విద్యని అభ్యసించుతూ, శిఖరాలని అధిరోహించాలని అన్నారు. ఈ కార్యక్రమములో హెడ్ మాస్టర్ మధుసూదన్ రాజు మాట్లాడుతూ, లక్ష్య సాధనకు విద్యార్థులు అనుసరించాల్సిన విధానాలను ఉదహరించారు. ఈ కార్యక్రమములో ఆకాష్ ఇన్స్టిట్యూట్ , ఏరియా హెడ్ మోడెమ్ నరసింహులు , మేనేజర్స్ సురేంద్ర, వాటికలి మహేష్, షేక్ షాహీన్, అడ్మిన్ చిరంజీవి, ఇతర ఆకాష్ స్టాఫ్ పాల్గొన్నారు.

## ఫ్యాషన్ టూర్ కు విశేష స్పందన

**తిరుపతి విద్య, డిసెంబర్ 10 ప్రభాత వార్త** బ్లెండర్స్ ప్రైడ్ ఫ్యాషన్ టూర్ వేగం పుంజుకుంది, మోటార్ క్రీడ, ఫ్యాషన్ ఉన్నతమైన స్థాయితో ఈ టూర్ కు విశేష స్పందన లభిస్తుందని పెర్నాడ్ రికార్డ్ ఇండియా సిఎంఓ దేబాశ్రీ దాస్ గుప్తా తెలిపారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ ఫ్యాషన్ డిజైన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సహకారంతో, స్టైల్, పవర్, మోటార్ క్రీడలచే ప్రేరేపించబడిన డిజైన్, అందమైన పెర్ఫార్మెన్స్ వేర్, ఉత్సాహవంతమైన ఫ్యాషన్ ప్రదర్శనను అందిస్తున్నామన్నారు. ప్రముఖ డిజైనర్లు నమ్రత జోషిపుర, అభిషేక్ పాట్నిలు అత్యంత ఉత్సాహవంతమైన డిజైన్లతో ఈ టూర్ ని ఉత్సాహపరుస్తున్నారని వెల్లడించారు. "ఫ్యాషన్, సాంస్కృతిక సంభాషణలను తీర్చిదిద్దడంలో బ్లెండర్స్ ప్రైడ్ ఫ్యాషన్ టూర్ ఎల్లప్పుడూ ముందు స్థానంలో ఉంటుందని తెలిపారు. తమను ఆదరిస్తున్న వినియోగదారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ చెర్మన్ సునీల్ సేథీ, ర్యాపర్ రఫ్తార్, హర్నార్ సందు, ఆ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఘనంగా సుందరం ఫైనాన్స్ వార్షికోత్సవం

**తిరుపతి విద్య, డిసెంబర్ 10 ప్రభాత వార్త** సుందరం ఫైనాన్స్ తిరుపతి బ్రాంచ్ 25 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సుందరం ఫైనాన్స్ ఆంధ్రా ప్రాంత ఉపాధ్యక్షుడు, హెడ్ ఎస్. బాలసుబ్రహ్మణియన్ మాట్లాడుతూ 2000లో స్థాపించబడిన తిరుపతి బ్రాంచ్, తిరుపతిలో ఆర్థిక ప్రాప్యతను విస్తరించడంలో కీలక పాత్ర పోషించిందన్నారు. తరచుగా ప్రధాన ఆర్థిక వ్యవస్థకు అందని కస్టమర్లకు సేవలు అందించింది. తిరుపతి బ్రాంచ్ బలం దాని ప్రజలలో ఉంది. అనేక మంది ఉద్యోగులు తమ కెరీర్‌లో ముఖ్యమైన భాగాన్ని ఇక్కడ గడిపారు, కేవలం నైపుణ్యంతో కాకుండా నిజాయితీ, లక్ష్యంతో సేవ చేశారు. వారి బంధం కస్టమర్లతో లావాదేవీలకు మించి ఉంది ఇది పరస్పర గౌరవం, పంచుకున్న పురోగతిపై నిర్మించబడిందని తెలిపారు. తమకు సహకరించిన వినియోగదారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ ప్రతినిధులు, ఉద్యోగులు, వినియోగదారులు పాల్గొన్నారు.

## ఐతేపల్లిలో వైభవంగా జాతర వేడుకలు

ఎంఎల్ఏ పులివర్తి నాని సారె



**చంద్రగిరి, డిశంబర్ 10 ప్రభాతవార్త:** ఐతేపల్లిలో నడివీధి గంగమ్మ జాతర వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. జాతర వేడుకలను పురస్కరించుకుని ప్రముఖ పారిశ్రామికవేత్త, క్లాస్ 1 కాంట్రాక్టర్ ఏ.వి.రమణమూర్తి, మాజీ జడ్పీటిసి సరిత, ఎంపిటిసి ఏసి శేఖర్ ప్రత్యేక ఆహ్వానం మేరకు ఎంఎల్ఏ పులివర్తి నాని అమ్మవారికి సారెను సమర్పించారు. గంగమ్మ జాతర వేడుకలలో గతంలో ఎన్నడూలేని రీతిన అంగరంగ వైభవంగా నిర్వహించారు. మంగళవారం రాత్రి నుండి బుధవారం వేకువజాము వరకు నడివీధి గంగమ్మను విశేష అలంకరణతో తీర్చిదిద్ది ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏవి రమణమూర్తి నివాసం నుండి సారెను మోసుకుని బయలుదేరిన ఎంఎల్ఏ బ్యాండు భాజాలు భాణాసంఛా పేలుళ్ల నడుమ ఆలయానికి చేరుకున్నారు. అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాద ఆశీర్వాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్‌యార్డు ఛైర్మన్ గౌస్‌భాషా, సింగిల్‌విండో ఛైర్మన్ రాజులగారి వినోద్‌కుమార్‌రెడ్డి, మాజీ జడ్పీటిసి వీరంగారి రమేష్‌రెడ్డి, టిడిపి మండల అధ్యక్షుడు ఏజి పల్లి బాల, ప్రధాన కార్యదర్శి కొండూరు ప్రవీణ్ రాయల్, లోకాద్రి నాయుడు, డాక్టర్ వాసు, క్వారీ శ్రీదర్ నాయుడు, శానంబట్ల సురేష్‌రెడ్డి, జయచంద్రారెడ్డి (జెసిఆర్), కన్నయ్య నాయుడు, మంగాపురం భాస్కర్, చంద్రబాబు, ఉస్మాన్, లతీష్, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రత నియమాలు పాటించండి..!



**రామచంద్రాపురం, డిశంబర్ 10 ప్రభాతవార్త:** వాహన చోదకులు రోడ్డు భద్రత నియమాలు తప్పక పాటించాలని ఎంఎస్ఎంఈ డైరెక్టర్ చినబాబు అన్నారు. బుధవారం రామచంద్రాపురం కూడలిలో ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు.. ఎస్ఐ భక్తవత్సలం గీతాంజలి స్కూల్ విద్యార్థులతో కలసి రోడ్డు భద్రత నియమాలపై ర్యాలీ నిర్వహించారు. రోడ్డు భద్రత నియమాలను విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శన ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహన చోదకులు తప్పక హెల్మెట్ వినియోగించాలని, కారులో ప్రయాణించే వారు విధిగా సీటు బెల్ట్ పెట్టుకోవాలని కోరారు. పెట్రోల్ బంక్ యజమానులు ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించని పక్షంలో పెట్రోల్ నింపరాదని తేల్చిచెప్పారు. ఈ కార్యక్రమంలో హెచ్ కానిస్టేబుల్ రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

## జాతర సంబరాల్లో పారిశుద్ధ్యం భేష్



**శ్రీకాళహస్తి, డిసెంబర్ 10 ప్రభాతవార్త**పట్టణంలో ఏడు గంగమ్మల జాతర సందర్భంగా పారిశుధ్యం సమస్య తలెత్తకుండా మున్సిపల్ కమిషనర్ భవాని ప్రసాద్, శానిటరీ ఇన్స్పెక్టర్ మోతీలాల్ పారిశుధ్య కార్మికులను ఆదేశించారు. బుధవారం జాతర సందర్భంగా ప్రత్యేకంగా పారిశుధ్యంను పర్యవేక్షించారు. జాతర సందర్భంగా కేవలం పట్టణ ప్రజలేకాకుండా చుట్టు ప్రక్కల గ్రామస్తులుకూడా అధిక సం ఖ్యలో గంగమ్మను దర్శించుకొనేందుకు పట్టణానికి విచ్చేస్తారని, పారిశుధ్యంపై ఎక్కడా రాజీ పడే ప్రసక్తేలేదని కమిషనర్ మున్సిపల్ సిబ్బందిని ఆదేశించారు. మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ మోతీలాల్ ఆధ్వర్యంలో కార్మికులతో మేస్త్రీలు ఎప్పటికప్పుడు పారిశుధ్యంను పర వ్యవేక్షించారు. ప్రతిసప్పరం వద్ద తడిచెత్తను, పొడిచెత్తను వేర్వేరు చేసి భక్తులకు ఎలాంటి అసౌకర్యంకలగకుండా చర్యలు తీసుకున్నారు.

## డప్పు కళాకారులను ఆదుకోవాలి:

**శ్రీకాళహస్తి, డిసెంబర్ 10 ప్రభాతవార్త**

రాష్ట్రంలోని డప్పు కళాకారులను ప్రభుత్వం ఆదుకో వాలని బుధవారం జరిగిన డప్పు కళాకారుల సంఘం సర్వసభ్య సమావేశంలో జిల్లా ప్రధానకార్యదర్శి సంక్రాంతి వెంకటయ్య డిమాండ్ చేసారు. పట్టణంలోని పుచ్చల పల్లి సుందరయ్య భవన్‌లో జిల్లా సంఘ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ డప్పు కళాకారుల సంక్షేమానికి బోర్డు ఏర్పాటు చేసి ఆదుకోవాలని డిమాండ్ చేసారు. రాష్ట్ర బడ్జెట్‌లో డప్పు కళాకారులకు ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు. ప్రతి కళాకారుడి కుటుంబానికి గుర్తింపు కార్డులతో పాటు రెండెకరాల సాగు భూమిని పంపిణి చేయాలని డిమాండ్ చేసారు. ఈసమావేశంలో జిల్లా గౌరవాధ్యక్షులు అంగేరి పుల్లయ్య, దేశండి అరుణాచలం, రెడ్డిపల్లి సురేష్, రాగిపాని నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థినులకు భద్రత భరోసా కల్పించాలి

తిరుపతి, డిసెంబర్ 10ప్రభాతవార్త: తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో చదువుకుంటున్న విద్యార్థినులకు భద్రత భరోసా కల్పించాలని టిటిడి బోర్డు సభ్యుడు జి.భానుప్రకాశ్‌రెడ్డి సూచించారు. ఇటీవల సంస్కృతవిశ్వవిద్యాలయంలో మొదటి సంవత్సరం బిఇడి విద్యార్థినిపట్ల ఇద్దరు ప్రొఫెసర్లు లైంగిక వేధింపులకు పాల్పడటం, విద్యార్థిని ఇంటికి వెళ్ళడం దుమారం రేపింది. చివరకు ఇద్దరు బాధ్యులైన ప్రొఫెసర్లు అరెస్ట్‌తో విశ్వవిద్యాలయంలోనివిద్యార్థినులకు భద్రత విషయంగా

# తిరుపతి డివిజన్

## రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలి



**పుత్తూరు రూరల్, డిసెంబరు 10 ప్రభాతవార్త:** రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు తులసిరాజన్ డిమాండ్ చేశారు. బుధవారం రైతులకు నష్ట పరిహారం ఇచ్చి ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ రైతు సంఘం వ్యవసాయ కార్మిక సంఘం (బీకేఎంయూ) ఆధ్వర్యంలో పుత్తూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తుఫాన్ వల్ల నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని, రైతులకు గిట్టుబాటు ధర కల్పించి నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోకపోతే ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకుడు మహేష్, రైతు సంఘం నాయకులు కేశవులు, మహీధర్, తిరుపాలయ్య, సీపీఐ నాయకులు సర్దార్, శివ, కృష్ణారెడ్డి, చంద్రబాబు, నవీన్, అంబు పాల్గొన్నారు.

## కౌశల్ క్విజ్‌కి రాష్ట్ర స్థాయికి ఎన్నికైన జోత్స్న



**పుత్తూరు రూరల్, డిసెంబరు 10 ప్రభాతవార్త:** పుత్తూరు మున్సిపాలిటీ రాచపాళెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థిని జి.జోత్స్న కౌశక్ క్విజ్ 2025పోటీల్లో జిల్లా స్థాయికి ఎన్నికైందని ప్రధానోపాధ్యాయులు తెలిపారు. ఈ విద్యార్థినికి మెమెంటో, ప్రశంసా పత్రం జిల్లా వద్యా శాఖ అధికారి కె.ఎన్.కుమార్‌చే అందుకుంది. జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి పోటీకి అర్హత సాధించింది. ఈవిద్యార్థినిపాఠశాలప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందనలు తెలిపారు.

## హలో బిసి చలోఢిల్లీ గోడపత్రిక ఆవిష్కరణ



**తిరుపతి కలెక్టరేట్, డిసెంబర్ 10 ప్రభాతవార్త :** బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకర్ రావు ,రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కుమ్మర క్రాంతి కుమార్ బుధవారం హలో బిసి, చలో ఢిల్లీ ఆవిష్కరించారు. సంస్థలుచట్టసభలలో ఓబీసీలకు జనాభా దామాషా మేరకు రిజర్వేషన్లు కేటాయించే బిల్లులను ఉభయ పాలకప్రతిపక్ష జాతీయ కూటములు ఈ శీతాకాల సమావేశాల లోనే పార్లమెంటులో ప్రవేశపెట్టి ఏకగ్రీవంగా చట్టాలు చేయాలని, ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు "బీసీ బంధు" కేసన శంకరరావు కోరారు. స్థానిక జిల్లా కార్యాలయంలో ఆ మేరకు బుధవారం కేంద్రాన్ని డిమాండ్ చేశారు. ఈనెల 15న ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద మహా ధర్నాతో పాటుపార్లమెంటు ముట్టడి కార్యక్రమం, ఆపై 16న ఓబీసీలకు జనాభా దామాషా మేరకు రాజకీయ రిజర్వేషన్లతో పాటు మహిళా రిజర్వేషన్ చట్టసవరణ చేసి ఓబీసీ మహిళలకు సబ్‌కోటా కేటాయించాలని డిమాండ్ చేస్తూ, విజ్ఞాపన పత్రాలను ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా లకు, కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీమల్లికార్జున ఖర్గే లతోపాటు పార్లమెంటు సభ్యులందరికీ అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆర్కె యాదవ్ , రాష్ట్ర కార్యదర్శి లోకయ్య , తిరుపతి జిల్లా అధ్యక్షులు నాగరాజ గౌడ్ , జిల్లా ప్రధాన కార్యదర్శి సోమశేఖర్ ఆచారి, జిల్లా ఉపాధ్యక్షులు మధు ఆచారి, ఆర్గనైసింగ్ సెక్రెటరీ నాగేంద్ర, రాయలసీమ అధ్యక్షులు వాసు గౌడ్, జిల్లా విద్యార్థి అధ్యక్షులుతిరుమలేష్, మహేష్, శ్రీనివాసులు, కడపఅధ్యక్షులులింగమూర్తిబీసీనాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎస్‌టియు నూతన కార్యవర్గం ఎన్నిక

**భాకరాపేట, డిసెంబర్ 10 ప్రభాతవార్త:** చిన్నగొట్టిగల్లు మండల కేంద్రంలో ఎస్‌టియు కార్యవర్గ సమావేశం నిర్వహించామని ఈ కార్యక్రమంలో మండల ఎస్ టి యు అధ్యక్షులుగా టి శ్రీరాములు ప్రధాన కార్యదర్శిగా ఎం రెడ్డెప్పరెడ్డి ఆర్థిక కార్యదర్శిగా డి సుబ్రహ్మణ్యం మహిళా కన్వీనర్ గా సునీత మండల ఉపాధ్యక్షులుగా చంగల్రాయ్ ఆచారి, ప్రకాష్ కుమార్ లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని ప్రధాన కార్యదర్శి రెడ్డప్ప రెడ్డి తెలిపారు

## వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభం



**భాకరాపేట, డిసెంబర్ 10 ప్రభాతవార్త:** మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్పాయ్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఒకరోజు వాలీబాల్ టోర్నమెంట్ను బిజెపి మండల అధ్యక్షుడు కిషోర్ రాయల్, జీవన్ నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బిజెపి యువ నాయకుడు భాను ప్రకాశ్ రెడ్డి తనయుడు పృథ్వి రెడ్డి హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు నిర్వాహకులు మాట్లాడుతూ గెలిచిన వారికి మొదటి బహుమతి 30,000, రెండవ బహుమతి 15000, మూడవ బహుమతి 5000గా నిర్ణయించామని తెలిపారు

## కూటమి ప్రభుత్వం తుఫాన్ చేనేత బాధితులందరిని ఆదుకుంటుంది :



**నారాయణవనం, డిసెంబర్ 10 ప్రభాతవార్త :** ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తీవ్రంగా నష్టపోయిన చేనేత కార్మిక కుటుంబాలతో అందరిని కూటమి ప్రభుత్వం ఆదుకోవడం జరుగుతుందని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పేర్కొన్నారు. బుధవారం మండలంలోని పాలమంగళం ఉత్తరం, దక్షణపుకండ్రిగ పంచాయతీల్లో తుఫాన్ ప్రభావంతో జీవనోపాధి కోల్పోయిన చేనేత కుటుంబాలు సుమారు 130 మందికి ప్రభుత్వం మంజూరు చేసిన బియ్యం, పప్పు, నూనె, గోధుమ, చెక్కెరను అందించారు. అర్హులైన వారందరికి ప్రభుత్వం సాయం అందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ ఫైనాన్స్ కమిటీ మెంబర్ కోనేటి సుమన్‌కుమార్, మాజీ ఎంపిపి పి గోవిందస్వామి, మాజీ వైస్ ఎంపిపి టి సుబ్రమణ్యం, ఎంపిడిఓ అరుణ, డిప్యూటీ తహశీల్దారు బానుచందర్, ఇఒపిఆర్‌డి డాక్టర్ వేణయ్య, సర్పంచ్ సాయిరవి, కుప్పస్వామిరెడ్డి గాంధీమతి, నాయకులు బిఎం నరేష్, పంచాయతీ కార్యదర్శి, విఆర్ఓలు, కూటమి ప్రభుత్వం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సిద్దార్థ ఇంజనీరింగ్ విద్యార్థులచే ఎన్ఎస్ఎస్ క్యాంపు

**నారాయణవనం, డిసెంబర్ 10 ప్రభాతవార్త :** మండల పరిధిలోని సిద్దార్థ ఇంజనీరింగ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల విద్యార్థులు స్థానిక బ్రాహ్మణాతాంగేల్ గ్రామంలో ఎన్ఎస్ఎస్ క్యాంపు కార్యక్రమాన్ని గత మూడురోజులుగా నిర్వహిస్తున్న ప్రిన్సిపాల్స్ మధు, జనార్ధన్‌రాజు, క్యాంకు ప్రోగ్రామ్ ఆఫీసర్స్ సురేష్, ప్రసాద్ తెలిపారు. క్యాంపులో భాగంగా మొదటి రోజు ఇంటింటా సర్వే, జీవన శైలిని విద్యార్థులు నమోదు చేశారు. ప్రజలకు ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించారు. రెండవ రోజు మంగళవారం డిజిటల్ పేమెంట్, సైబర్ క్రైమ్‌పై అవగాహన కల్పించారు. మూడవ రోజు బుధవారం పాఠశాల, వీధులను శుభ్రం చేశారు. ఆరోగ్యం పట్ల ప్రజలకు అవగాహన కల్పించారు. వాలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## వేదాంతపురం రోడ్లకు మహర్దశ

–చంద్రగిరి నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు ఊపు



**తిరుపతిరూరల్, డిసెంబర్ 10 ప్రభాతవార్త:** తిరుపతిరూరల్ మండలం వేదాంతపురం గ్రామ పంచాయతీలో అభివృద్ధి పనులు ఊపందుకున్నాయి. ఎన్నో ఏళ్లుగా ప్రజలు ఎదురుచూస్తున్న కీలక రహదారి పనులకు బుధవారం టిడిపి నాయకులు భూమిపూజ చేసారు. జెసిబితో రోడ్డు పనులు ప్రారంభించారు. రాయలచెరువు రోడ్డులో ఉన్న స్కంద బేకరీ నుంచి చెంచులక్ష్మీ కాలనీ, కొండొళ్ళు కాలనీ వరకు, ఆరు రోడ్లకు దాదాపు రూ.2.24కోట్ల రుపాయల ఎన్ఆర్ఇజిఎస్ నిధులతో సి.సి.రోడ్డు వేయనున్నట్లు వేదాంతపురం టిడిపి అధ్యక్షుడు చెఱుకుల పరంధామయాదవ్ తెలిపారు. చాలాకాలంగా దారుణస్థితిలో ఉన్న ఈ రహదారిపై ప్రయాణం ప్రజలకు పెద్ద సవాల్‌గా మారింది. వర్షాకాలంలో ప్రజలు మరింత ఇబ్బందులు చవి చూశారు. రోడ్డు పనులకు భూమిపూజ చేయడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేసారు. చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని సహకారంతో వేదాంతపురం రోడ్లకు మహర్దశ రానున్నదని పరంధామ యాదవ్ ఆనందం వ్యక్తం చేసారు. చంద్రగిరి నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధికి ఎమ్మెల్యే నాని ప్రత్యేక దృష్టి సారించినట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. వేదాంతపురం గ్రామ పంచాయతీలో మరెన్ని అభివృద్ధి పనులు జరగనున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు శ్యామ్‌బాబు, చంద్ర, చిరంజీవి, ప్రసాద్, సాయి, మాధవ్ శంకర్, సాయి, నవీన్, గౌతమి, రఘురామ్‌రెడ్డి, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

## రె నక్స్ట్ ఎక్స్ పో పోస్టర్ ఆవిష్కరణ



**తిరుపతి విద్య, డిసెంబర్ 10 ప్రభాత వార్త** ఈనెల 19,20,21 తేదీలలో విజయవాడ వేదికగా నిర్వహించే ఎక్స్ పో పోస్టర్ ను ఆంధ్రప్రదేశ్ సోలార్ ఎనర్జీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా ఆవిష్కరించారు. బుధవారం స్థానిక ప్రైవేట్ హోటల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ గురవయ్య, టెక్నికల్ ఈఈ వాసవి లత , ఏపీ సోలార్ ఎనర్జీ అసోసియేషన్ అధ్యక్షులు హేమ కుమార్ మువ్వల పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవిష్యత్తు ఇంధన అవసరాలను దృష్టిలో ఉంచుకుని సోలార్ ఎనర్జీ వినియోగం పెరగడం అత్యవసరమని, ముఖ్యంగా గృహ స్థాయిలో సోలార్ కనెక్షన్లను ప్రోత్సహించడం ద్వారా ఆంధ్రప్రదేశ్ ను దేశంలోనే అత్యధిక సోలార్ వినియోగ రాష్ట్రంగా నిలపవచ్చని పేర్కొన్నారు. రె నక్స్ట్ ఎక్స్ పోలో అత్యాధునిక సాంకేతికత, సోలార్ పరికరాలు, పునరుత్పాదక శక్తి పరిష్కారాలు, పరిశ్రమలకు సంబంధించిన నవీన ఆవిష్కరణలు ప్రదర్శించ బడనున్నాయని నిర్వాహకులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కోర్ కమిటీ మెంబర్స్ బాబు నాయుడు, మణికండన్, చంద్రశేఖర్, శైలజ, తేజ కుమార్, సాంబశివరావు, రామ్మోహన రావ్, నాగరాజు జయ బాబు పాల్గొన్నారు.

## ఏపీఎన్‌జిజిఓ అసోసియేషన్ వాకాడు తాలూకా ఎన్నికలు




వాకాడు, డిసెంబర్ 10 ప్రభాతవార్త: ఇరిగేషన్ కార్యాలయం నందు బుధవారం నిర్వహించారు. ఈ ఎన్నికలకు గూడూరు తాలూకా కార్యదర్శి తనూజ్ కుమార్ ఎన్నికల అధికారిగా, తిరుపతి తాలూకా కోశాధికారి ఎం శ్రీనివాసులు సహా ఎన్నికల అధికారిగా, తిరుపతి జిల్లా కమిటీ కోశాధికారి బి.లలిత్ కుమార్ పరిశీలకులుగా వ్యవహరించారు. మధ్యాహ్నం రెండు గంటల వరకు జరిగిన నామినేషన్ల స్వీకరణ కార్యక్రమంలో ఒక్కొక్క పోస్టుకు గాను ఒక్కొక్క నామినేషన్ దాఖలు కావడంతో, ఎన్నికల అధికారి తనూజ్ కుమార్ ఎన్నికలు ఏకగ్రీవమైనట్లు ప్రకటించారు. నూతన కార్యవర్గంలో వాకాడు తాలూకా అధ్యక్షులుగా టి కృష్ణయ్య, సహా అధ్యక్షుడు డి.అఖిల్ కుమార్, ఉపాధ్యక్షులుగా ఎంఎస్ ప్రసాద్, సిహెచ్ కృష్ణారావు, కె.రవీంద్ర కుమార్, కార్యదర్శిగా వై శంకరయ్య, సంయుక్త కార్యదర్శు లుగా జి సంపూర్ణ, డి.మహేంద్ర, టి.సురేష్, మహిళ సంయుక్త కార్యదర్శిగా ఆర్ సరోజనమ్మ, కోశాధికారిగా జె.చిట్టెమ్మ ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన వాకాడు కార్యవర్గ సభ్యులు చేత ఎన్నికల అధికారి ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో గూడూరు తాలూకా అధ్యక్షులు శ్రావణ్ కుమార్, నాయుడుపేట అధ్యక్షులు శ్రావణ్ కుమార్, గురు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

## ఏకలవ్య మోడల్ స్కూల్ విద్యార్థులకు పరామర్శ



ఓజిలి, డిసెంబర్ 10 ప్రభాతవార్త: మండలంలోని వాకాటివారికండ్రిగ గ్రామంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూలు విద్యార్థులను బుధవారం సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పరామర్శించారు. ఇటీవల సుమారు 20 మంది 7వ తరగతి విద్యార్థులను ఉపాధ్యాయులు చితక బాదారు. ఈ ఘటనలో పలువురు విద్యార్థులు గాయపడ్డారు. ఈ నేపథ్యంలో బుధవారం ప్రిన్సిపాల్ పవన్‌కుమార్ సింగ్‌తో కిలివేటి సంజీవయ్య మాట్లాడారు. ఆయన వెంట మండల వైసీపీ కన్వీనర్ పాదర్తి హరనాథ్‌రెడ్డి, ఎంపిపి గడ్డం అరుణారెడ్డి, రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి దేశిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు ఖాదర్‌బాషా, కొండవల్లిపాడు సర్పంచ్ కొండూరు ప్రభాకర్‌రాజు, నాయకులు కాకాని రవి, జమళ్ల రవి యాదవ్, బట్టా అనిల్‌కుమార్ యాదవ్, ఉగ్గుముడి సంతోష్‌రెడ్డి, సుందరయ్య, పరసా శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరులో కలపండి



కోట, డిసెంబర్ 10 ప్రభాతవార్త: నియోజక వర్గాన్ని నెల్లూరు జిల్లాలో కలపాలంటూ కోట మండలం విద్యానగర్‌లోని గాంధీబొమ్మ వద్ద నిరసన కార్యక్రమం జరిగింది. బుధవారం చెందోడు గ్రామానికి చెందిన ఎంవి రావు ఫౌండే షన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని శాంతి యుతంగా నిర్వహించారు. దివంగత ముప్పవరపు వెంకటేశ్వరరావు, ఆదిలక్ష్మిల పేరిట ఏర్పాటైన ఎంవి రావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆ సంస్థ ఛైర్మన్ ముప్పవరపు లీలామోహన్‌కృష్ణ నిర్వహించారు. గూడూరును తిరుపతి జిల్లాలో కలపడం వలన ప్రజలు ఎంతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వెళ్లాలంటే వ్యయప్రయాసలకు గురవుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు డాక్టర్ సారంగం రమేష్‌బాబు, ఎంవి రావు ఫౌండేషన్ ఛైర్మన్ ముప్పవరపు లీలామోహన్‌కృష్ణ, కార్యదర్శి ఎం.విజయలక్ష్మి, పెన్షనర్ల సంఘం నాయకులు, పెన్షనర్ల సంఘం నాయకులు, విశ్రాంత ఉపాధ్యాయుడు ఆవుల సుబ్బయ్య, గూడూరు డివిజన్ బీసీ సంఘం అధ్యక్షులు వెంపులూరి బాబురావు, టిడిపి నాయకులు ధనయ్య, గ్రామ ప్రజలు, విద్యార్థులు, మహిళలు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వానికి పతనం తప్పదు : నేదురుమల్లి




వెంకటగిరి, డిసెంబర్ 10 ప్రభాతవార్త: రాష్ట్రంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలను కూటమి ప్రభుత్వం ప్రైవేటుపరం చేస్తే ఆ రోజే ప్రభుత్వానికి పతనం తప్పదని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయ కర్త నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి తెలిపారు. వెంకటగిరి నియోజకవర్గంలో మెడికల్ కళాశాలలను ప్రైవేటుపరం చేయరాదని సేకరించిన సంతకాల పత్రాలను వెంకటగిరిలోని ఆయన నివాస గృహం నుండి నెల్లూరుకు తరలించారు. వెంకటగిరి నియోజకవర్గంలో 72,000 సంతకాలు సేకరణ జరిగిందని తెలిపారు. రాష్ట్రంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఉండగా 17 మెడికల్ కళాశాలలను కొత్తగా స్థాపించింది అని, కొత్త మెడికల్ కాలేజీలు కొన్ని పూర్తికాగా కొన్ని పనులు జరుగుతున్నాయని చెప్పారు. మెడికల్ కాలేజీలో ప్రైవేటుపరం చేసే ఆలోచన విరమించుకునే వరకు వైసిపి ఆధ్వర్యంలో పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బాలయ్య, జిల్లా టెలికం సలహాలు సభ్యులు హరికృష్ణ, మండల పార్టీ కన్వీనర్లు ప్రసాద్ రెడ్డి, శ్రీనివాసులు, కార్తీక్ రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, కౌన్సిలర్లు ఎంఏ నారాయణ, శ్రీనివాసులు, సుబ్బారావు, కళ్యాణి, ధనియాల రాధా, నాయకులు దశరధరామిరెడ్డి, మురళీకృష్ణ, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత కంటి పరీక్షలు



వాకాడు, డిసెంబర్ 10 ప్రభాతవార్త: అన్ని దానాలలో కెల్లా నేత్రదానం గొప్పదని ఎస్ఏఎల్‌సిఈఎఫ్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పిడుగు ప్రవీణ్ కుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రమైన వాకాడులోని ముస్లిం వీధిలో ఉన్న మోడల్ ప్రాథమిక పాఠశాలలో రమేష్ ఐ కేర్ కంటి వైద్య నిపుణులు వంజివాక రమేష్ నేతృత్వంలో కంటి వైద్య శిబిరం బుధవారం నిర్వహించారు. విద్యా ప్రదాత స్వర్గీయ వెంకటేశ్వర రావు, ఆదిలక్ష్మిల జ్ఞాపకార్థం కోట మండలం చెందోడు గ్రామానికి చెందిన ఎంవి రావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కంటి వైద్య శిబిరాన్ని ప్రధానోపాధ్యాయులు పిడుగు ప్రవీణ్ కుమార్ జాలాది కిషోర్‌లు ప్రారంభించారు. ముందుగా వెంకటేశ్వరరావు ఆదిలక్ష్మిల చిత్రపటానికి పూలమాలవేసి జ్యోతి ప్రజల్వన చేసి వారికి నివాళులర్పించారు. వీరు చేస్తున్న సేవలకు తమ వంతు సహకారం కూడా అందిస్తామని అన్నారు. అనంతరం డాక్టర్ వంజివాక రమేష్, వారి సిబ్బంది పర్యవేక్షణలో స్థానిక ప్రజలకు పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులకు స్థానిక పాఠశాల సిబ్బందికి ఉచితంగా కంప్యూటర్ పరీక్షలు నిర్వహించారు. నేత్ర సమస్యలు ఉన్న వారిని గుర్తించి కంటి శుక్లాలు ఉన్నవారికి ఆపరేషన్లు, కంటి అద్దాలు అవసరమైన వారికి అతి తక్కువ రేటుతో కంటి అద్దాలు, అందరికీ ఉచితంగా కంటి మందులు డ్రాప్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాలలో విధులు నిర్వహించే ఉపాధ్యాయులు, విద్యార్థులు, రమేష్ ఐ కేర్ హాస్పిటల్ వైద్య సిబ్బంది, ఫౌండేషన్ కార్యదర్శి ఎం. విజయలక్ష్మి స్థానికులు ఉన్నారు.

## కోటి సంతకాల సేకరణ పత్రాలు తరలింపు



నాయుడుపేట రూరల్, డిసెంబర్ 10 ప్రభాతవార్త: రాష్ట్రంలో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను నిరసిస్తూ నాయుడుపేట ప్రాంతంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ముమ్మరంగా చేపట్టారు. ఈ నేపథ్యంలో బుధవారం కోటి సంతకాల సేకరణకు సంబంధించిన పత్రాలను నెల్లూరు జిల్లా వైసీపీ కేంద్రానికి తరలించారు. ఈ కార్యక్రమంలో సూళ్లూరుపేట నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పాల్గొన్నారు. నియోజకవర్గంలోని ఆరు మండలాలు, రెండు మున్సిపాలిటీలలో కలిపి మొత్తం 50 వేల సంతకాలు సేకరించినట్లు ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని వైసీపీ కన్వీనర్లు, జడ్పిటిసిలు, ఎంపిపిలు, ఇతర ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## కలంకారిలో రాష్ట్రపతి అవార్డు అందుకున్న విజయలక్ష్మి



వెంకటగిరి, డిసెంబర్ 10 ప్రభాతవార్త: కలంకారి వస్త్రాల తయారీలో పెయింటింగ్ మరియు డ్రాయింగ్‌లో ప్రతిభ కనబరచి నందుకు పోలూరు విజయలక్ష్మి రాష్ట్రపతి మురుముర్ చేతుల మీదుగా ప్రతిష్టాత్మక అవార్డు అందుకున్నారు. 2023,2024 సంవత్సరానికి గాను విజయలక్ష్మికి ప్రతిష్టాత్మక జాతి అవార్డును అందజేశారు. కుప్పంపల్లి గ్రామానికి చెందిన విజయలక్ష్మి కలంకారి వస్త్రాల తయారీలో డ్రాయింగ్, పెయింటింగ్‌లలో తన ప్రతిభను చాటుకున్నారు. మారుమూల గ్రామానికి చెందిన విజయలక్ష్మి జాతీయ స్థాయి అవార్డు అందుకున్నారు. కలంకారి వస్త్రాల తయారీకి ఆమె డ్రాయింగ్ పెయింటింగ్ వేశారు.

## ప్రభుత్వ భూములు కబ్జా చేసే వారిపై చర్యలు

వెంకటగిరి, డిసెంబర్ 10 ప్రభాతవార్త: ప్రభుత్వ భూములను బోగస్ పట్టాలు, బోగస్ రిజిస్ట్రేషన్‌లతో ఆక్రమిస్తే వైసిపి ప్రభుత్వం వస్తుందని వారిపై చర్యలు తీసుకుంటామని ఆ పార్టీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి హెచ్చరించారు. వెంకటగిరి పట్టణంలోని క్రాస్ రోడ్డు వద్ద ఉన్న స్థలంలో అంబేద్కర్ కమ్యూనిటీ భవనం కట్టే విషయంలో వచ్చిన వివాదం స్థలాన్ని ఆయన పరిశీలించారు. వెంకటగిరి పట్టణంలో ప్రభుత్వ భూములను కొందరు బోగస్ పట్టాలుతో ఆక్రమించి విక్రయాలు చేస్తున్నట్లు తెలిపారు. భూ సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ఆయన వెంట పట్టణ వైసిపి కన్వీనర్ ప్రసాద్‌రెడ్డి, బాలాయపల్లి మండల కన్వీనర్ కార్తీకరెడ్డి, దళిత సంఘం నారి సురేష్, డేవిడ్, పంజా ధనంజయ, జాషువా తదితరులు ఉన్నారు.

## కోటి సంతకాల సేకరణ విజయవంతం : ఎమ్మెల్సీ మేరిగ




గూడూరు, డిసెంబర్ 10 ప్రభాతవార్త: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి రాష్ట్రానికి తీసుకొచ్చిన ప్రభుత్వ వైద్య కళాశాలలను కూటమి ప్రభుత్వం ప్రవేటీకరణ చేస్తోందని, దీన్ని నిరసిస్తూ చేపట్టిన కోటి సంతకాల సేకరణ విజయవంత మైందని ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ తెలిపారు. గూడూరు పట్టణంలోని సనత్ నగర్‌లో ఉన్న పార్టీ కార్యాలయంలో ఆయన వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ప్రవేటు వైద్య కళాశాలలను ప్రవేటుపరం చేయొద్దంటూ వైకాపా చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమం పూర్తయ్యింది. ఈ నేపద్యంలో భాగంగా సంతకాల సేకరించిన ప్రతులను తిరుపతిలోని వైకాపా కార్యాలయానికి వాహనంలో తరలించారు. పేద విద్యార్థులకు వైద్య విద్యను అందించే దిశగా వైద్య కళాశాలలను ప్రవేటు పరం చేయొద్దని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు చేవూరి విజయమోహన్‌రెడ్డి, నాశిన నాగులు, విజయకుమార్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, బాలక్రిష్ణారెడ్డి, సంపత్ కుమార్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, సుభాన్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## ఐదు రూపాయల భోజనంతో పేదలు సంతృప్తి : ఎమ్మెల్యే




గూడూరు, డిసెంబర్ 10 ప్రభాతవార్త: పేద వారికి ఐదు రూపాయలకు అందించే భోజనం ఎంతో నాణ్యతగా ఉందని, ఇదే విషయాన్ని ప్రజలు చెబుతున్నారని ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ తెలిపారు. గూడూరు పట్టణంలోని పాతబస్టాండు ప్రాంతంలో ఉన్న అన్నా క్యాంటీన్‌ను ఆయన అధికారులు, నాయకులతో కలిసి సందర్శించారు. గూడూరు పట్టణంలోని పాతబస్టాండు ప్రాంతంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసిన అన్నా క్యాంటీన్‌ను ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ సందర్శించారు. క్యూలో నిలబడి ప్రజలతో పాటు ఆయన భోజనం రుచి చూశారు. భోజనం ఎలా ఉందంటూ ఎమ్మెల్యే పేదలను అడిగారు. ఎంతో రుచికరంగా ఉందని వారు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ వెంకటేశ్వర్లు, పార్టీ నాయకులు శీలం కిరణ్ కుమార్, పులిమి శ్రీనివాసులు, బిల్లు చెంచురామయ్య, భాస్కర్ రెడ్డి, కరుణాకర్ రెడ్డి, రహీమ్, శ్రీనివాసులు, మట్టం శ్రావణిరెడ్డి, బి.లీలావతి, పచ్చ వెంకటేశ్వర్లు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## మానవ హక్కులపై విద్యార్థులకు అవగాహన సదస్సు



గూడూరు, డిసెంబర్ 10 ప్రభాతవార్త: ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా బుధవారం నారాయణ ఇంజనీరింగ్ కాలేజ్ గూడూరు నందు విద్యార్థి విద్యార్థులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమంలో మండల లీగల్ సర్వీస్ కమిటీ గూడూరు వారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా సభ్యులు విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ ఎస్సి,ఎస్టి అట్రాసిటీస్ ప్రివెన్షన్ న్యాయవాది డాక్టర్ అరవ పార్వతయ్య, భారతయ్య పాల్గొన్నారు. సభకు అధ్యక్షునిగా నారాయణ కాలేజ్ ప్రిన్సిపాల్ విశ్వక్సేనారెడ్డి, పార్వతయ్య మాట్లాడుతూ ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ ఆమోదించిన కనీస మానవ హక్కులు అవగాహన పత్రంలో ఒకటి సమానంగా గౌరవ మర్యాదలు పొందే హక్కు అని అన్నారు. భారత ప్రభుత్వం లోకాయుక్త ఎస్సీ ఎస్టీ కమిషన్ హైకోర్టు సుప్రీం కోర్టు,అన్ని ఇతర లాయర్ కోర్సు నుండి స్వేచ్ఛ సమానత్వం సౌభ్రాతృత్వం కొరకు పోరాడవచ్చునన్నారు.ఈ కార్యక్రమంలో హైమావతి లోక్ అదాలత్ సూపర్నెంట్, కాలేజ్ అధ్యాపకులు ఖాదర్ భాషా పాల్గొన్నారు.

## వాకాడులో ఘనంగా దివ్యాంగుల దినోత్సవం

వాకాడు, డిసెంబర్ 10 ప్రభాతవార్త: మండల కేంద్రమైన వాకాడులోని బుధవారం భవిత కేంద్రంలో ప్రపంచ దివ్యంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఐఈ కోఆర్డినేటర్ చంద్రశేఖర్ రెడ్డి, ఎంఈఓలు ఆనంద్, నసీం అలీ, ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొని దివ్యాంగుల పిల్లలకు బహుమతులు అందజేశారు. ఎంఈఓ ఆనంద్ మాట్లాడుతూ ప్రభుత్వం, దాతల సహకారంతో పిల్లలకు మెరుగైన విద్యుత్‌తో పాటు, అనేక యంత్రాల పరికరాల ద్వారా అర్థం చేసుకున్నట్లు విద్యా బోధన చేస్తున్నట్లు తెలిపారు.

## హర్షవర్ధన్‌కి సేవాసంస్థ ఆర్థిక సాయం



సూళ్లూరుపేట, డిసెంబర్ 10 ప్రభాతవార్త: తిరుపతికి చెందిన 11 ఏళ్ల హర్షవర్ధన్ అనే నిరుపేద బాలుడు స్కేటింగ్‌లో అద్భుత ప్రతిభ కనబరుస్తున్న నేపథ్యంలో ఆ చిన్నారిని ఆదుకునేందుకు సూళ్లూరుపేటలోని ఆచార్య భరద్వాజ సేవాసంస్థ ముందుకు వచ్చింది. కర్ణాటక బార్డర్ నంగిలి నుంచి తిరుపతి,శ్రీకాళహస్తి మీదుగా పుత్తూరు వరకు 230కిలోమీటర్లు స్కేటింగ్‌లో ప్రయాణించి హర్షవర్ధన్ రికార్డు నెలకొల్పాడు. ఈ సందర్భంగా ఆచార్య భరద్వాజ సేవాసంస్థ ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొని అతని తల్లిదండ్రులను, కోచ్ ప్రతాప్‌ను అభినందించి రూ.25 వేలు ఆర్థిక సహాయాన్ని అందించారు. భవిష్యత్‌లో మరెన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆచార్య భరద్వాజ సేవాసంస్థ ప్రతినిధులు ఆకాంక్షించారు.

## గిరిజనులకు దుప్పట్లు పంపిణీ

సూళ్లూరుపేట, డిసెంబర్ 10 ప్రభాతవార్త: మండలంలోని గోపాల్‌రెడ్డిపాలెం పంచాయతీ తంగెళ్లదిబ్బ గిరిజన కాలనీలోని గిరిజనులకు జనసేన పార్టీ ఆధ్వర్యంలో దుప్పట్ల పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం చేపట్టారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ స్ఫూర్తితో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు జనసేన నాయకులు మాబాషా తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు రమణ, హరిబాబు, కోటి, ఆవుల దాస్, శంకు సురేష్, సూరి, హరి, ప్రవీణ్, బిజెపికి చెందిన బెజవాడ విజయమ్మ, వాకిచర్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## నిమజ్జనానికి బయలుదేరిన గంగమ్మలు



శ్రీకాళహస్తి,డిసెంబర్ 10 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో చలికాలం నిర్వహించే ఏడుగంగమ్మల జాతర భక్తుల భాగస్వామ్యంతో కన్నుల పండువగా బుధవారం నిర్వహించారు. ఏడుగంగమ్మల దర్శనంతో పట్టణంలోనూ, చుట్టుపక్కల గ్రామాల్లో భక్తి భావం విల్లివిరిసింది. ఏడు దిక్కులను చల్లంగా కాపాడండి అక్కచెల్లెల్లార అంటూ భక్తులు మొక్కుకున్నారు. బుధవారం రాత్రి ఏడుగురు అక్కాచెల్లెలు నిమజ్జనానికి బయలుదేరారు. శ్రీకాళహస్తిలో నిర్వహించే ఏడు గంగమ్మల జాతరలో నిర్వాహకులు సప్పరాల ఏర్పాటు, స్థావరాల ముస్తాబులో పోటీలు పడటం ఆనవాయితీ.ఈ నేపథ్యంలో ఈ ఏడాది కూడా నిర్వాహకులు తమిళనాడు, ఇతర ప్రాంతాల నుంచి కళాకారులను రప్పించారు.రెండేళ్ళ తరువాత అంగరంగ వైభవంగా నిర్వహించిన జాతరలో ఏడుగురు అమ్మవార్లను రక రకాలుగా ముస్తాబు చేసారు. పట్టణంలోని ముత్యాలమ్మగుడివీధిలోని తెట్టురాయికి సమీపంలోని ఏడుగంగమ్మలు నిలిచేస్థలంలో ఏడు ప్రాంతాల్లో గంగమ్మలను ఆచారం ప్రకారం నిల్పారు. అనంతరం వేకవజాము నాలుగుగంటల సమయంలో మేళతాళాలు, మంగళవాయిద్యాలు పంబజోళ్లమోత, తప్పెట్లతో గంగమ్మలను (పసుపు ముద్దలను).ముత్యాలమ్మగుడివీధిలోగంగమ్మలుబయలుదేరే సమయంలో మొదట ప్రతి అమ్మవారి విగ్రహం వద్ద గుమ్మడికాయలు, టెంకాయలు కొట్టి అఖండ కర్పూరహారతులిచ్చారు.

**గంగమ్మలను దర్శించుకున్న అతిథులు:**

పట్టణంలో ఏడుగంగమ్మల మాజీ ఎంఎల్ఏ బియ్యపు మధుసూధనరెడ్డి, మాజీ శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివులు వారి సహచరులు దర్శించుకుని పూజలు నిర్వహించుకున్నారు. ఆయనకు గంగమ్మ జాతర కమిటీ నిర్వాహకులు అమ్మవార్ల తీర్థప్రసాదాలు అందించారు. ఆయన వెంట శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి మాజీ చైర్మెన్ అంజూరు శ్రీనివాసులు వైకాపా నాయకులు పగడాల రాజు, మైనారిటి నాయకుడు పఠాన్ ఫరీద్ ఖాన్,సిరాజ్,బుల్లెట్ శ్యాం,సురేష్, పులి రామచంద్రయ్య, అట్ల రమేష్, టైలర్ శ్రీనివాసులు,నరసింహారాజు(నంద) మునికృష్ణారెడ్డి,పాలమంగళం రవి,శివకుమార్ యాదవ్, మాజీ ధర్మకర్తల మండలి సభ్యుడు చంద్ర,కామి వెంకటేశ్వర్లు, పూడి రవి, శంకర్ జీవికె రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## రక్తపాతం లేని రాజకీయ నరమేధం ఓటర్ల తొలగింపు !

తిరుపతి కలెక్టరేట్, డిసెంబర్ 10 ప్రభాతవార్త : ఓటర్ల జాబితా నుంచి పౌరులను తొలగించడమంటే రక్తపాతం లేకుండా చేసే రాజకీయ నరమేధమే నని ఆర్థిక విశ్లేషకులు డాక్టర్ పరకాల ప్రభాకర్ ఆరోపించారు. అంతర్జాతీయ మానవహక్కుల దినోత్సవ సందర్భంగా బుధవారం ఉదయం తిరుపతిలోని టౌన్ క్లబ్ హాల్ లో పౌరచైతన్య వేదిక తిరుపతి జిల్లా అధ్యక్షులు వాకా ప్రసాద్ అధ్యక్షత జరిగిన పౌరచైతన్యవేదిక ప్రథమ రాష్ట్ర సదస్సులో ఆయన కీలకోపన్యాసం చేశారు. పౌరులను ఓటర్ల జాబితానుంచి తొలగించడమంటే ప్రజాస్వామ్యాన్ని ఒక్కసారిగా నరికి వేయడమేనని, నెమ్మదిగా రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని తీసేయడమేనని ఆయన వ్యాఖ్యానించారు.

## 14న వాజ్‌పాయి శత జయంతి ఉత్సవాలు



గూడూరు, డిసెంబర్ 10 ప్రభాతవార్త: భారతరత్న మాజీ ప్రధాని స్వర్గీయ అటల్ బీహార్ వాజ్పేయి శత జయంతి ఉత్సవాల్లో భాగంగా భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు రామ్ మాధవ్ చేపట్టిన అటల్ బీహార్ వాజ్పేయి, ప్రధాని నరేంద్ర మోడీ సుపరిపాలన యాత్ర విజయవంతం కావాలని రాష్ట్ర కిషన్ మోర్చా సీనియర్ నాయకులు, గూడూరు ఏఎంసి డైరెక్టర్ గాలి ప్రకాష్ నాయుడు పేర్కొన్నారు. బుధవారం బిజెపి పార్టీ కార్యాలయంలో రాష్ట్ర కిషన్ మోర్చా సీనియర్ నాయకులు, గూడూరు ఏఎంసి డైరెక్టర్ గాలి ప్రకాష్ నాయుడు విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడుతూ అన్ని జిల్లాలను పర్యటిస్తూ డిసెంబర్ 14వ తేది తిరుపతిలో రేణిగుంట నేషనల్ హైవే, మర్రిగుంట సర్కిల్ వద్ద వాజ్పాయ్ విగ్రహ ఆవిష్కరణ, బహిరంగ సభ జరుగుతుందన్నారు. వాజ్పేయ్ పుట్టిన రోజు డిసెంబర్ 25ను గుడ్ గవర్నెన్స్‌డేగా జరుపుకోవడం దేశంలో ప్రజలందరికీ గర్వకారనం అన్నారు. ఈ కార్యక్రమంలో గూడూరు రూరల్ మండలం ఉపాధ్యక్షుడు రేనంగి రవి ప్రజాపతి, రూరల్ మండల కార్యదర్శి గుంటపూడి మధు పాల్గొన్నారు.

## కోటిసంతకాల సేకరణ పత్రాలతో వైసిపి భారీ ర్యాలీ



చిత్తూరురూరల్, డిసెంబర్ 10 ప్రభాతవార్త: మెడికల్ కళాశాలను ప్రైవేట్ పరం చేయరాదని వైయస్సార్సీపి ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమంను పూర్తి చేసినట్లు చిత్తూరు నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త ఎంసి విజయానందరెడ్డి తెలిపారు. వీటిని చిత్తూరుజిల్లా అధ్యక్షుడు కరుణాకరరెడ్డి ఆధ్వర్యంలో విజయవాడ వైఎస్ఆర్సీపి కేంద్ర కార్యాలయంలో అందజేయడం జరుగుతుందన్నారు. అనంతరం కోటిసంతకాల సేకరణ పత్రాలను జిల్లా అధ్యక్షుడు కరుణాకరరెడ్డికి అందజేయడం కోసం చిత్తూరు పార్టీ కార్యాలయం నుంచి మురకంబట్టు వరకు స్కూటర్లపై భారీ ర్యాలీగా తరలి వెళ్లారు. ఈ కార్యక్రమంలో జిల్లా పార్లమెంటు సెక్రటరీ రెడ్డెప్ప, వైఎస్ఆర్సీపి నాయకులు జ్ఞానజగదీష్, గాయత్రీదేవి, రాహుల్‌రెడ్డి, హరిణిరెడ్డి, సంతపేట నారాయణ, అను, అన్బు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వరద బాధితులకు నష్ట పరిహారం చెల్లింపు : ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్



కేవీబీ పురం, డిసెంబరు 10 ప్రభాతవార్త: రాయల చెరువు తెగడం వల్ల నష్ట పోయిన వరద బాధితులకు నెల రోజుల్లో నష్ట పరిహారం చెల్లింపుకు ప్రభుత్వానికి నివేదికలు పంపుతానని తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. కేవీబీపురం మండలంలోని కళత్తూరు దళితవాడలో బాధితులకు నష్ట పరిహారం అందించే ఈ సమావేశాన్ని శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాష్ రెడ్డి ఆదేశాల మేరకు తహసీల్దార్ రోశయ్య, ఎంపీడీవో మాలతి ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, జాయింట్ కలెక్టర్, సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాయల చెరువు కట్ట తెగిపోవడంతో జరిగిన విపత్తుకు కళత్తూరు పంచాయతీకి నాలుగు కోట్లకుపైగా నష్టం జరిగిందని, వాటికి పనులకు ప్రభుత్వం నుంచి ఖర్చు చేయడం జరిగిందని తెలిపారు. ఈ నష్ట పరిహారం ఎవరికైనా అందలేదంటే అర్జీలు ఇవ్వమని జిల్లా కలెక్టర్ కోరారు. సమావేశంలో నియోజకవర్గ కో-ఆర్డినేటర్ కూరపాటి శంకర్‌రెడ్డి, శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి, రాష్ట్ర టీడీపీ ఉపాధ్యక్షుడు సతీష్‌నాయుడు, రాష్ట్ర బీసీ సంఘం నాయకుడు మునస్వామి యాదవ్, సురుటుపల్లి దేవస్థాన చైర్మన్ పద్మనాభరాజు, చైర్మన్ బుచ్చినాయుడు, మండలేఎంసీ చైర్మన్ సుధాకర్‌నాయుడు, రామాంజులనాయుడు, కళత్తూరు గోపినాథ్‌రెడ్డి, ఇరిగేషన్ డీఈ, మండల విద్యాశాఖ ఎంఈవోలు లక్ష్మిపతి, రవికుమార్, ఏఏఎస్‌వో మల్లీ, ఏపీవో, ఏపీఎం, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, ఇరిగేషన్‌శాఖ, పశు సంవర్ధకశాఖ అధికారులు, కూటమి నాయకులు థామస్, బీజేపీ అధ్యక్షుడు బాబుయాదవ్, సాదు, అరుణాచలం పాల్గొన్నారు.

## ఆర్థికంగా ఆదుకుందాం: ఎంఎల్ఏ

శ్రీకాళహస్తి,డిసెంబర్ 10 ప్రభాతవార్త: శ్రీకాళహస్తిలోని అతి పురాతనమైన చేనేత పరిశ్రమను ఆదుకుందామని ఆర్థికంగా నిలదొక్కుకొనుటకు ప్రభుత్వం చేయూత నిప్పిద్దామని శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని భాస్కర్‌పేటలోని చాముండేశ్వరి కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన క్లస్టర్ అభివృద్ధి కార్యక్రమాలకు శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి దంపతులు ముఖ్యఅతిధులుగా హాజరయ్యారు. చేనేత కమిషనర్ రేఖారాణి, యూనిట్ ఇన్‌చార్జి సల్లా గోవిందు పర్యవవేక్షణలో కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా చేనేత కార్మికులు ప్రతిభాపాటవాలను ప్రదర్శించారు. నేడు మార్కెటింగ్ పోటీల్లో తట్టుకునేందుకు వినియోగదారుల అభిరుచికి తగ్గట్లు నాణ్యత పెంపుచేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ నెల 13న చేనేత శాఖ మంత్రి సవితచే చేనేత కార్మికులకు పని ముట్లు అందించనున్నట్లు ఎంఎల్ఏ సూచించారు. ఈ సందర్భంగా కమిషనర్ రేఖారాణి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రంతో పాటు కేంద్ర జవుళి శాఖల సహాకారం ఎంతో ఉందన్నారు. ఈ సమావేశంలో శ్రీకాళహస్తి వ్యవసాయమార్కెట్ కమిటి చైర్మెన్ రంగినేని చెంచయ్యానాయుడు, ఎంఎల్ఏ సతీమణి రిషితా రెడ్డి తదితరులుపాల్గొన్నారు.

## తీవ్రగాయాలతో త్రుటిలో తప్పిన ప్రాణాపాయ స్థితి

చంద్రగిరి, డిశంబర్ 10 ప్రభాతవార్త: అగరాల సమీపంలోని హైవే ఆనుకుని వున్న ప్రముఖ ప్రైవేటు కళాశాలలోని విద్యార్థి మేడపై నుండి ప్రమాదవశాత్తూ క్రిందపడి తీవ్రగాయాలపాలయ్యాడు. వివరాల్లోకెళితే.. కలికిరికి చెందిన మహిధర్ రెడ్డి ఇంటర్మీడియెట్ సెకండియర్ చదువుతున్నాడు. 5 మంది స్నేహితులతో కలసి హాస్టల్ నుండి రాత్రి వేళ బయటకు వెళ్ళడానికి మెయిన్ గేట్ ద్వారా వెళితే సెక్యూరిటీ అడ్డుకుంటారని విద్యార్థులు తమ గదిలోని కిటికీ ఊచలను కొంత మేర తొలగించి వెనుక వైపున గల పైపులను పట్టుకుని క్రిందకు దిగడం పరిపాటిగా మారింది. ఈ విషయంపై గతంలో కళాశాల యాజమాన్యం తీవ్రంగా హెచ్చరించినప్పటికీ కాళ్ళావేళ్ళాపడిన విద్యార్థులు తమ చర్యలను మాత్రం వీడలేదని తెలిసింది. ఆ మేరకు మంగళవారం రాత్రి డాబాకు వెళ్ళడానికి 5 మంది విద్యార్థులు క్రిందకు దిగే ప్రయత్నం చేశారు. పైపులను పట్టుకుని క్రిందకు దిగే క్రమంలో మహిధర్‌రెడ్డి జారి క్రిందపడ్డాడు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలై రక్తస్రావమయ్యింది. దీంతో కళాశాల యాజమాన్యం తిరుపతిలోని ఓ ప్రైవేటు హాస్పిటల్‌కు తరలించారు. వైద్య చికిత్సల అనంతరం విద్యార్థి ప్రాణాపాయ స్థితి నుండి బయటపడినట్లు కళాశాల అధికారులు తెలిపారు.


**వెంకటగిరి పురపాలక సంఘం, వెంకటగిరి**

ఆర్ఓసినెం.505/2015/ఎ1 తేది : 10.12.2025

**బహిరంగ వేలం ప్రకటన**

వెంకటగిరి పురపాలక సంఘమునకు చెందిన చేపల చెరువులు 1) అమ్మవారిపేట చెరువు 2) కుమ్మరగుంట చెరువు 3) చెవిరెడ్డిపల్లి చెరువు 4) ధర్మాపురం చెరువు 5) పెరియవరం మరియు మరాటపల్లి చెరువు 6) పోలిశెట్టిగుంట చెరువు 7)మనులాల పేట 8) బొప్పాపురం చెరువు చెరువులలో చేపలు పట్టుకొను హక్కునకు తేది 16.12.2025 ఉదయం 11.00గంటలకు మరియు బందిలదొడ్డి వీధి నందు గల (ప్రభుత్వ ఆసుపత్రి దగ్గర) షాపింగ్ కాంప్లెక్స్‌లోని ఖాళీగా వున్న 1,2,4,6,8,9,10, 11,12,13,14,15,16 మొత్తము 13 షాపులకు నెలసరి అద్దెకు లీజుకు ఇచ్చుటకు ఆదేరోజు మధ్యాహ్నం 12.00 గంటలకు పురపాలక సంఘ కార్యాలయ ఆవరణలో బహింగ వేలము నిర్వహించబడును. మరియు వేలములో పాల్గొనువారు ఇతర వివరములు కొరకు కార్యాలయ పనివేళలలో సంప్రదించగలరు.

| వ.నెం గుత్త వివరములు | దాఖలు చేయవలసిన సాల్వెన్సీ మొత్తము | ముందుగా చెల్లించ వలసిన దరావత్తు రూ |
|---|---|---|
| 1. మునిసిపల్ షాపింగ్ కాంప్లెక్స్ నందలి షాపు రూములు | రూ.50,000/- | రూ.50,000/- |
| 2. చేపల చెరువులు | రూ.50,000/- | రూ.50,000/- |

వేలం పాటలో పాల్గొనదలచిన వారు ముందుగాపై తెలిపిన విధముగా ధరావత్తు సొమ్ము, సాల్వెన్సీ ధృవపత్రము దాఖలుపరచవలెను. ఎటువంటి కారణములు తెలుపకనే వేలం తేదీలు వాయిదా వేయుట మరియు మార్చు చేయుటకు కమీషనరు గారికి అధికారము కలదు. ఇతర వివరములు కార్యాలయము పనిచేయు వేళలలో ఎ1 గుమస్తా వారిని సంప్రదించి తెలుసుకొనవచ్చును మరియు తేది 11.12.2025లోపు సాల్వెన్సీ ధృవపత్రములు ఈ కార్యాలయమునకు అందజేయవలసినదిగా తెలియజేయడమైనది. గడువు దాటిన తదుపరి సాల్వెన్సీ ధృవపత్రములు స్వీకరించబడవు.

**కమీషనరు**
**వెంకటగిరి పురపాలక సంఘం**